# స్నేహితులు

D. S. Shankar
VAKKALANKA.

## కొడవటిగంటి కుటుంబరావు

ఆత్మవంచనకు కూడా ఒక హద్దున్నది. ప్రకాశం ఒకంతట నిస్పృహా చెందేరకం కాకపోయినప్పటికి, తన జీవితం విరిగిన పాలవతుగా అయిపోయిందన్నది గుర్తించటం మొదలు పెట్టాడు. ఇక తను అపజయం అంగీకరించవచ్చు. కలలు కనటం మాని నిద్రలేవవచ్చు. తనకు నలభై నిండి నలభై ఒకటి జరుగుతున్నది. అయిదుగురు పిల్లలు. దాదాపు అందరూ రోగిష్టివాళ్ళే. తన సంపాదన నెలకు నూటయాభై-పెద్ద పిల్లకు ఈయేడు కాకపోతే పైయేడు, లేకపోతే ఆ పైయేడు, పెళ్ళిచేసి తీరాలి. లేకపోతే ఇల్లాలు నాగమ్మ ఉరి పోసేసుకుంటుంది. ప్రకాశం మెడకు దేవుడు వేసిన ఉచ్చులను మధ్య మధ్య బిగించేపని నాగమ్మ తనపై వేసుకుని ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్నది.

"పదహారేళ్ళనుంచీ బడిపంతులు పని అఘోరిస్తున్నాను. బాకీలే తప్ప పాపలాకాను వెనకెయ్యలేదు. వచ్చే ఏడాది - రెండేళ్ళలో లక్ష్మి పెళ్ళి ఖర్చులూ, కట్నాలూ, యిచ్చుకునే డబ్బు కూడబెట్ట గలనా? అసంభవం!" అని ప్రకాశం ఒకనాడు అన్నాడు. ఆ మాట అనటంలో ద్రోహ బుద్ధిగాని, అహంకారంగాని మరే యితరమైన అభ్యంతరకర విషయంగాని వుందని ప్రకాశం గర్భశత్రువు కూడా అనడు. అయినా నాగమ్మ ఆ మాటలు వింటూనే కొయ్యబారిపోయి, "అయితే యింతకూ మీ ఉద్దేశం ఏమనీ?" అని అడిగింది.

"ఉన్నమాట చెబుతుంటే ఉద్దేశాలడుగుతా వేమిటి?" అన్నాడు ప్రకాశం.

"ఉన్నమాటో లేనిమాటో, ఊరికే చెబుతారేమిటి?" అన్నది నాగమ్మ. నే నంత వెర్రిదాన్నా అన్నట్టుగా.

"తొమ్మిది గంట లయిందంటావనుకో, నీ ఉద్దేశ మేమిటని నే నడిగితే అందులో అర్థం ఏముంటుందీ?"

"ఎందుకుండదూ? మాచక్కగా వుంటుంది! వంట కాక పోతేనో వేళ మించిపోతేనో కైముగురించి అనుకుంటాం అంతేగాని నిష్కారణంగా—"

"అది ఉద్దేశంకాదు."

"ప్రతి మాటకూ మీరు వేరే అర్థాలు తీస్తారు. నాకు తెలీదా ఏం? ఇంతకీ లక్ష్మికి పెళ్ళికి యెగనాం పెట్టటానికేగా మీరు డబ్బు మాట ఎత్తిందీ?" అని నాగమ్మ దీర్ఘాలు తీసింది.

"ఎగనాం పెట్టదలిస్తే డబ్బు లేదనుకోవటం దేనికి? ఉన్నా ఎగనాం పెట్టొచ్చునే! ఎగనాం పెట్టాలని లేకనేగదా—"

"డబ్బొక సాకు అంతే. అయ్యో పిల్ల పెళ్ళి వచ్చిపడుతుందే అన్న దిగులు మొదటినుంచీ వుంటే యీపాటికి కొంత వెనకెయ్యలేక పోయామా? పెళ్ళిఖర్చులమాట యిప్పుడా ఆలోచించేది?"

నాగమ్మ పరాయిదానల్లే, తన ఆర్థికపరిస్థితిపట్ల అణుమాత్రం సానుభూతి లేకుండా మాట్లాడటం యిది మొదటిసారికాదు. అనేక శతాబ్దాలుగా మగవాడు ఆడదాన్ని హీన ప్రాణిని చేసి, అడ్డమైన కట్టుబాట్లలోనూ వుంచి, దాదాపు ఏ హక్కులూ లేకుండా చేసినందుకు ఆడది తీసుకోగల ప్రతీకారచర్య ఒకటే ఉంది! మగవాడికి ప్రతి క్షణమూ వాడి బాధ్యతలు జ్ఞాపకం చెయ్యడమూ, వాడిమీద వీలయినంత బరువు వెయ్యటమూనూ. ఈ పని చేసే నేర్పు మధ్యతరగతి స్త్రీలలో బహుకొద్ది మందికే ఉంటుంది. వారికి ప్రతినిధి నాగమ్మ. ధనిక వర్గానికి చెందిన మగాళ్ళు పెళ్ళాలు వేసే భారాన్ని సులువుగా మొయ్యగలరు. తమ స్త్రీలకు ఏ హక్కులూ లేవన్న సంగతి జ్ఞాపకం రాకుండా కూడా చెయ్యగలరు. పేదవాళ్ళలో స్త్రీలకు కొంత స్వేచ్ఛ ఉంది. వాళ్ళు తమ బరువు చాలా వరకు తామే మోస్తారు. అవసరమైతే అప్పుడప్పుడూ మొగుడి బరువుకూడా మోస్తారు. ప్రకాశం లాంటి మధ్యతరగతి కుచేలుడికే భార్యల రంపపుకోత భరించే దుస్థితి ఏర్పడుతుంది.

ప్రకాశం యిన్నాళ్ళూ ఆశాజీవిగానే బతకటానికి యత్నించాడు. ప్రత్యక్షంగా వున్న కష్టాలమీద గొంతెమ్మ కోరికల ముసుగులు కప్పాడు. లక్ష్మి పుట్టిరాక ఉద్యోగం దొరికింది. లక్ష్మితో తన అదృష్టం తిరిగిందను కున్నాడు — పదిమందితో అన్నాడు కూడానూ. ఆ రోజుల్లో నూరురూపాయల ఉద్యోగం నిక్షేపంగా కనిపించింది. తానూ, భార్యా, ఒక చంటిపిల్లనూ హాయిగా కాలం గడించింది, జీతం పెరుగుతూ వచ్చింది. దానితోబాటు సంసారం పెరిగింది. వరసగా పిల్లలు పుట్టుకు వచ్చారు. అది తన తప్పేనని ప్రకాశానికి తరవాత గాని తెలిసిరాలేదు. సంసారం పెరగటంతోబాటు వస్తువు ధరలన్నీ పెరిగాయి. అది ప్రకాశం తప్పుకాదు. ఖర్చులు పాపంలాగా రెండింతలూ, మూడింతలూ పెరగకుండావుంటే యింత పెద్ద సంసారాన్ని ప్రకాశం ఏదోవిధంగా యీదుకొచ్చి వుండును. పదిహేను రూపాయలబాడుగ యిచ్చి సుఖంగా గడిపిన ప్రకాశం యీనాడు అరవైరూపాయల యింట్లో యిరకలేక సతమతమవుతున్నాడు.

అసహాయస్థితిలో మనిషి తత్వంలో పడతాడు. ప్రకాశం తత్వంలో పడ్డాడు. దారిద్ర్యానికి చాలా ముళ్ళున్నాయి. అందులో ఏ ముల్లు యెక్కువ బాధిస్తుంది? "పిల్లలు తిండి కేడుస్తున్నారు, ఇంట్లో పాత్రలన్నీ పగిలిపోయాయి. ఆ బాధకన్నా, నా భార్య తన చింకిపాత కుట్టుకోవటానికి సిగ్గుపడుతూ పొరుగావిణ్ణి సూది అడిగితే ఆవిడ యీసడింపుగా లేదు పొమ్మనటం నన్ను హెచ్చుగా బాధిస్తున్నది" అని పూర్వకవి కుచేలు డొకడు శ్లోకం చెప్పాడు. అదేవిధంగా ప్రకాశం దారిద్ర్యబాధను అనేకవైపుల నుంచి సహిస్తూ ఏ వైపునుండి తనకు హెచ్చు బాధ కలుగుతున్నదీ తేల్చుకోలేకపోయాడు.

'ఇప్పటికే ముగ్గురు పిల్లలు. మీ ఆవిడ మళ్ళీ కడుపుతో వుంది. ఈ భాగం మీకు చాలదు. వేరే ఇల్లు చూసుకోండి.' అని ఒకప్పుడు ప్రకాశం ఇంటి యజమాని అన్నాడు.

"ఏదో విధంగా సర్దుకుపోతాం. ఏం చేస్తాం మరి?" అన్నాడు ప్రకాశం, ఇంటాయనికి తనమీద జాలి అనుకుని.

"మీరు సర్దుకుపోతే మేం సర్దుకు పోలేం. ఇల్లు త్వరలో ఖాళీ చెయ్యండి." అన్నాడు ఇంటాయన కుండ పగలేసి.

ఇది ప్రకాశాన్ని బాధించింది.

పొరుగింటివాళ్ళు ఆడపిల్లలకు సంగీతం మేష్టార్లనిపెట్టి సంగీతం చెప్పిస్తుంటే తాను ఆ పని చేయలేనందుకు బాధపడినదాకా నాగమ్మ తల్లి వదల్లేదు.

పిల్లలకు తియ్యకుండావుండే రోగాలకు రోజూ డాక్టరును పిలవలేనిస్థితిలో వుండటమూ బాధించింది ప్రకాశాన్ని. డాక్టరుకు ఫీజిచ్చి పిలిపించటంకన్న హెచ్చు ఖర్చు వాళ్ళు రాసిచ్చే మందులు. మందులతో తీరదు. వాటి వెనక టానిక్కులు వస్తాయి. దారిద్ర్యాన్ని ఒక వ్యాధిగా గుర్తించి దానికెవరైనా చికిత్స చేస్తే ఎంతబాగుండును!

మగపిల్లలు డబ్బు, ఆడపిల్లలు ఖర్చు—ఈ సంగతి ప్రకాశం నిజంగా అర్థంచేసుకోవటానికి చాలాకాలం పట్టింది. మొదటి సంతానం ఆడపిల్ల పుడితే అందరూ ఎందుకు దిగులుపడతారో అతనికి అర్థమయేదికాదు; మగపిల్లవాడి తండ్రి అనిపించుకోవటంకంటె ఆడపిల్ల తండ్రి అనిపించుకోవటంలో ఏదో విశేషం ఉందనుకునేవాడు. కాని స్వానుభవంమీద లోకమనుకునేదే నిజమనీ, తనది భ్రమ అనీ అతనికి తెలిసివచ్చింది. లక్ష్మి మగపిల్లవాడైతే యింకో రెండేళ్ళలో ఓ పాతిక రూపాయలు ఏదో విధంగా తేగలిగేవాడు. ఇంకో రెండేళ్ళకు లక్ష్మి తనకు చెయ్య గలిగిందేమిటంటే తనచేత మూడు నాలుగు వేలు - ఎక్కణ్ణుంచైనా రానీ!—ఖర్చు చేయించటం!

లక్ష్మి తరవాతనైనా మగపిల్లవాడైతే బాగుండేది. కాని

రెండోదీ ఆడపిల్లే అయింది. లక్ష్మి పెళ్ళినుంచి కోలుకునేలోపుగా దాని పెళ్ళి వచ్చిపడుతుంది. ఇవే నిజమైన వ్యాధులు!

మూడోవాడు ముక్తేశ్వర్రావు. వాడింకా ఆరోస్టాండర్డు అఘోరిస్తున్నాడు. అర్భకుడూ, మందమతీనూ, జ్ఞాపకశక్తిలేదు. ఎంతకష్టపడినా హానిహానిగా ప్యాసుమార్కులొస్తాయి. బహుశా స్కూలుఫైనల్ దగ్గిర మొండి పడతాడు. 'వాడికి ట్యూషనుపెడితే మంచి మార్కులే వస్తాయి. వాడు తెలివి తక్కువవాడేమీకాడు.' అని నాగమ్మ ప్రవచించింది.

'వాడి చదువుకు సహాయం చెయ్యటానికి నే నుంటినిగా?' అన్నాడు ప్రకాశం.

'మీరా? మీవల్ల ఏమవుతుంది?' అని నాగమ్మ తేల్చేసింది.

'ఎందుచేతా?' అన్నాడు ప్రకాశం.

'మీవల్లఅయ్యేట్లుంటే యితర పిల్లలెవరూ చెప్పించుకోరేం?' అన్నది నాగమ్మ.

'ముత్తిగాడు' తండ్రిని సహాయం చెయ్యనివ్వడు! అసలు సంగతి అదీ. 'ఏమిట్రా నువు చదివేది?' అంటూ ప్రకాశందగ్గరికి వస్తే చాలు. వాడు పుస్తకాన్ని రొమ్ముల కదుముకుని 'ఏదోలే!' అంటాడు. లేకపోతే చదువు కట్టిపెట్టేస్తాడు.

ప్రకాశం ఆశావాదిగా భవిష్యత్తు బాగుంటుంది. ఏదో జరుగుతుంది. ఏమిటో అవుతుందని తనలో ఆశపడుతూ వచ్చాడు. ఆ ఆశ కూడా అతని ఆర్థికపరిస్థితి లాగా కృశిస్తూ వస్తున్నది. అతనికి తన దారిద్ర్యం కన్న సినిమాలలో చూపే దారిద్ర్యం భయంకరంగా కనిపించేది. సినిమాలలో దారిద్ర్యం అనుభవించేవారి మధ్య ఆత్మీయత ఉంటుంది! ఒకరి దుస్థితిని చూసి ఒకరు రెట్టింపు బాధపడతారు. అదీగాక ప్రపంచమంతా వారిపై కత్తికట్టినట్టు కనిపిస్తుంది. అందుచేత ప్రేక్షకుడి ప్రాణాలు అల్లాడిపోతాయి.

తన దారిద్ర్యానికి యీ లక్షణాలేవీ లేవు. 'అయ్యో, నా పెళ్ళాన్నీ, పిల్లల్నీ యీ దారిద్ర్య బాధనుంచి తప్పించలేక పోతినే!' అని ప్రకాశం ఎన్నడూ తన గుండెను చెరువు చేసుకోలేదు. తమకు సరిగా తిండికే చాలదన్న విషయం గుర్తించక నాగమ్మ ఎవరో కట్టుకున్న ఉప్పాడ జరీ చీరెల్నీ, ఎవరో కొనుక్కున్న కొత్తరకం బంగారు గాజుల్నీ గురించి లొట్టలు వేస్తూ చెబుతుంటే ప్రకాశానికి మండుకొచ్చేది. బరువు మోస్తున్న తనపట్ల నాగమ్మకుగాని, పిల్లలకుగాని ఏమీ సానుభూతి లేదు. వాళ్ళు చూసినదల్లా తన అప్రయోజకత్వమే!

ఇదొక విషయం. రెండో విషయ మేమిటంటే లోకం తనని క్రూరంగా చూసినట్టు కనిపించలేదు. ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడన్నా ఎరిగినవాళ్ళు ప్రకాశానికి సహాయ పడుతూనే వున్నారు. అతనైనా మరీ గండకత్తెర వచ్చి పడితే తప్ప యెవరిదగ్గిరా చెయ్యి చాచడు.

మూడో విషయ మేమంటే తాను నిరుద్యోగికాడు. ఉద్యోగం ఉన్నది. నూటయాభై రూపాయలు నెల కాగానే చేతికందుతాయి. ఉద్యోగం చేసుకుంటూ నెలకు అరవైరూపాయలు ఇంటిఅద్దెకింద కట్టేవాడు బిచ్చగాడెలా అవుతాడు? తొంభైరూపాయల మీద ఏడు జీవాలు బతకడం ఎలా? ఈ రెండు ప్రశ్నలకూ సమాధానం లేదు.

సినిమా దారిద్ర్యానికీ తన దారిద్ర్యానికీ ఏవిధమైన పోలికా లేక పోయినా దానిలాగే యిదికూడా యెప్పుడో ఒకప్పుడు అకస్మాత్తుగా సుఖాంతమవుతుందని ప్రకాశం ఆశిస్తూ వచ్చాడు.

ఈ లోపల అప్పులు పెరిగి పోతున్నాయి. దుకాణంవాడు అరువివ్వనేశాడు— రెండునెల్ల వెచ్చాల బాకీ దిగబడి పోయింది. బట్టల కొట్టువాడు సగమన్నా ఇయ్యమని ప్రాధేయ పడుతున్నాడు. సాటి ఉపాధ్యాయుడు పార్వతీశం దగ్గిరచేసిన చేబదులు తీరనేలేదు. జీతం పుచ్చుకునేరోజు పార్వతీశం మొహం చూడటం కష్టంగా వుంది.

'మనకన్న దారిద్ర్యం అనుభవిస్తున్నవాళ్ళు - ఇంకా పెద్ద సంసారాలు కలవాళ్ళూ, అసలు ఏ సంపాదనా లేనివాళ్ళూ ఎందరు లేరు ?' అన్న ఆలోచననుంచి ఏ విధమైన తృప్తీ కలగటం మానేసింది ప్రకాశానికి. ఒకడి పంటిసలుపు మరొకడికి తెలీదు. ఎవడి దారిద్ర్యం వాడిదే. ఎవడి చావు వాడు చావాలిసిందే.

కమ్యూనిస్టు సత్యనారాయణ యీమాటకూడా అనుకోనివ్వడు. పంటి సలుపూ, చావూ వ్యక్తిగతమైనవేటగాని, దారిద్ర్యం సాంఘిక మైనదట.

'అయితే నా దారిద్ర్యం అందరూ అనుభవించరేం ?' అన్నాడు ప్రకాశం.

సత్యనారాయణ ఏదో చెప్పుకుపోయాడు. చిట్టచివరకతను పంటిసలుపూ, చావూకూడా సాంఘికమైనవేనని తేల్చాడు. సంఘం సరిగా ఉంటే యెవరూ చావరా అని ప్రకాశం అడిగాడు. అకాల మరణాలుండవన్నాడు సత్యనారాయణ.

భగవాన్లు గ్రహచారమంటాడు. అతను ప్రకాశం చక్రంవేసి చూసి 'ఇంకో రెండేళ్ళు మీ పరిస్థితి యిల్లాగే వుంటుంది. ఆ తర వాత చాలా సుఖంగా నడుస్తుంది' అన్నాడు; ఆమాట నమ్మబుద్ధయింది ప్రకాశానికి. అతనిలో ఉండే ఆశావాదానికి జోస్యం నచ్చినట్టుగా విప్లవవాదం నచ్చలేదు. సంఘం యెప్పటికీ మారితే తప్ప సిస్థితి మారదంటే యెట్లా మరీనూ! సంఘం మారకుండా ఎంతమంది పరిస్థితి మారటం లేదు ?

భగవాన్లు చెప్పిన గడువింకా నాలుగైను నెలలుందనగా ప్రకాశానికి నిరాశపట్టుకుంది. దానికి కారణం ప్రకాశానికి జాతకాలలో నమ్మకం పోవటం కాదు — వారఫలాలు ఏ వారమూ తనకు నిజం కాకపోయినా వాటిని అతను చూడటం మానలేదు; నలుగురు నాలుగు రకాల ఫలితాలు చెబితే వాటిలో

తనకు అనుకూలంగా వుండే ఫలితాలమీదనే ఆశలన్నీ పెట్టుకుంటూ వచ్చాడు కూడా. అయితే యిప్పుడు ప్రకాశాన్ని నిరాశ ఆవరించ టానికి కారణం - నిరాశా భయం! ఇంకో నాలుగైదు నెలల్లో తన పరిస్థితి బాగుపడకపోతే తాను ఆశించటానికి ఏ ఆధారమూ ఉండదు. ఈ భయం ప్రకాశాన్ని పీడించ నారంభించింది.

## 2

వెంకట నారాయణకు శలవు మంజూరయింది. నెలరోజులు నిశ్చింతగా తిరగవచ్చు. కాని యెక్కడ తిరగాలన్న విషయం భార్యాభర్తలమధ్య వివాదం రేపెట్టింది.

"మా బంధువుల ఊళ్ళకు కాకుండా యింకెక్కడికైనా సరే." అన్నది సత్యవతమ్మ.

"మరీ దూరం కాకుండా వుంటే యెక్కడికైనా ఫరవాలేదు" అన్నాడు వెం.

"కాశో రామేశ్వరమో వెళ్ళితే నాలుక్కాలాలుపాటు చెప్పుకునేందు కుంటుంది" అన్నది స.

"అవా దగ్గరచోట్లు?" అన్నాడు వెం.

"దగ్గరని నే నెప్పు డన్నానూ?" అన్నది స.

"దూరం వెళితే డబ్బు చాలదు. రెండు మూడొందలకన్నా ఖర్చు పెట్టటం వొట్టి అవివేకం."

'ఐతే మీ వేపు బంధువుల వూరేదన్నా చూడండి. వెళ్ళి నెల్లాళ్ళు తిష్ఠ వేద్దాం. తేలికలో పోతుంది.'

'ఏ బంధువులు మన్ని కూచోబెట్టి మేవుతారు? హొటళ్ళలో వుండేట్టయితే యెంతడబ్బూ చాలదు. అంచేతా—'

సత్యవతమ్మ అధ్యక్షుడి అంత్యోపన్యాసం చెప్పేసింది :

'చూడదగిన చోట్లేమో దూరం. రైలుచార్జీలు జాస్తి. అయిన వాళ్ళిళ్ళకుపోతే ఒకటి రెండురోజులు మించి వుండటానికి లేదు. వాళ్ళుంచుకోరు. హొటళ్ళలో వుండటం అన్నివిధాలా దండగ. చూడటాని కేమీలేని వూరెళ్ళి హొటలుతిండి తింటూ డబ్బు తగలేసుకోవటం ఇంట్లో కూచోవటం మేలు. మీ రెందుకు శలవు తీసుకున్నారో తెలీటంలేదు. మనం బయటిప్రపంచంలోకి అడుగుపెట్టడానికి నోచుకోలేదు. అసలు విషయం అదీ!'

'పోనీ నువ్వే చెప్పు' అన్నాడు వెం.

'అయ్యో బాబూ! మిమ్మల్నేమీ అనలేదండీ. ఉన్నవిషయమే చెబుతున్నా. హాయిగా ఏ కాశో, ఏ రామేశ్వరమో—'

'కాశీకి పోవటానికి మూడు రోజులూ, రావటానికి మూడు రోజులూ, అక్కడ మూడు రోజులూ - మిగిలిన మూడు వారాలు ఏం చేసేట్టు? ఈ తొమ్మిది రోజులకుగానూ యెంతవుతుంది. నాలుగున్నర టిక్కెట్లు - జనతాయే అనుకో—'

సత్యవతమ్మ కాస్త ఆలోచించి 'ఇది పెళ్ళిళ్ళ కాలమే. నాలుగు చోట్ల నాలుగు పెళ్ళిళ్ళయినా బాగణ్ణు!' అన్నది.

'నాలుగు పెళ్ళిళ్ళేం నాలుగువేల పెళ్ళిళ్ళవుతాయి. మనని పిలిచేవాళ్ళుండొద్దూ? అయినా పెళ్ళిళ్ళు కూడా సినిమాలల్లే అయాయి. సినిమా అంతగా బాగుండదని అనుమానంవేస్తే పత్రికలవాళ్ళకి ఒకవారం నడిచాక చూపిస్తారుట. అట్లాగే పెళ్ళిళ్ళ ఖర్చు

భరించలేనివాళ్ళు, లాంఛనంగా అహ్వానించే వాళ్ళకి పెళ్ళయిన మర్నాడందేట్టు శుభలేఖలు పోస్టు చేస్తారుట!' అంటూ వెం. మాటల తడిక అల్లసాగాడు. అది అతని హాబీ.

'ఇప్పుడు మనంవున్న స్థితిలో శుభ లేఖంటూ అందాలేగాని పెళ్ళయిన మూడోనాడన్నా వెళతాంగాని ఊరుకుంటామా?' అన్నది స.

'ఏం లాభం? సినిమా ప్రెస్‌షో అయినాక తిరిగి వెళ్ళిపోయే కార్ల బారును చూడటానికి వెళ్ళినట్టుగా ఉంటుంది... ప్రెస్‌షో అంటే జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు పట్నంలో పెళ్ళి ఇన్విటేషన్లు నాటకాల కాంప్లిమెంటరీ టిక్కెట్లల్లే ఉంటున్నాయి తెలుసా?'

'చాల్లే ఊరుకోండి. మీదంతా—'

'—ఇన్విటేషన్ వెంట రిసెప్షన్‌కు ఒక బుల్లి కార్డూ, డిన్నరుకు యింకో బుల్లి కార్డూ ఉంటుంది. డిన్నరు కార్డుమీద ఎడ్మిట్ వన్ అని కూడా ఉంటుంది. కొందరికి ఉత్త ఇన్విటేషన్లే వెళతాయి. కొందరికి రిసెప్షన్ కార్డు కూడా ఉంటుంది. మరీ అదృష్టవంతులకు డిన్నరు కార్డుకూడా వుంటుంది. ఎడ్మిట్ వన్. ఆ కార్డు చూపించందే భోజనాల చోటుకు రానివ్వరనుకుంటా!'

సత్యవతమ్మ నవ్వుతూనే, 'ఇహ చాలించండి!' అని భర్తను ప్రోత్సహించింది.

'ఈ సిమిలారిటీ - అంటే పెళ్ళిళ్ళకి సినిమాలకీ పోలిక-యెంత బాగా స్థిరపడి పోయిందంటే కొన్ని నాటకాల కాంప్లిమెంటరీ టిక్కెట్లు పెళ్ళి శుభలేఖల్లాగా ఉంటాయి! శ్రీమతి అండ్ శ్రీ వై. వెంకటనారాయణా ఇన్‌వైట్ యూ టు ఏ పబ్లిక్ షో అఫ్ దేర్ మెయిడెన్ ప్రొడక్షన్—'

సత్యవతమ్మ ఆగమని భర్తకి సంజ్ఞచేసి, 'వానూ, వానూ! పోస్టు వచ్చినట్టుంది తీసుకోరా!' అని పెద్దకొడుక్కు కేకపెట్టింది.

'ఏమిటంటున్నానూ?' అన్నాడు వెం.

'ఎక్కడికి పోవాలో తేల్చకుండా ఉండటానికి ఏమైనా అంటున్నారు.'

'ఆన్ ది కాంట్రరీ! మనం యీ శలవులు నెల్రోజులూ యే విధంగా దుర్వినియోగపరచాలా అన్న సంగతి గురించి తప్ప నేను మరోవిషయమే ఆలోచించటంలేదు. వెధవ పోస్టుమన్ వచ్చి నా త్రెడ్ బ్రేక్ చేసేశాడు!'

వాసు పోస్టు చంకనుపెట్టుకుని ఒక శుభలేఖలాటిది చదువుతూ వచ్చాడు.

'ఏమిట్రా అదీ!' అన్నది సత్యవతమ్మ ఆత్రంగా.

'శుభలేఖ' అన్నాడు వా.

'అది తెలుస్తూనేవుంది. పెళ్ళా, ఒడుగా, గృహప్రవేశమా? ఎవరికీ, ఎప్పుడూ, ఏ వూర్నుంచీ?' అన్నది స.

'మీక్కాదులేమ్మా! నాకు—పర్సనల్—నా క్లాస్ మేట్ లే' అంటూ యింకా ఆ శుభలేఖనే చదువుతున్నాడు వా.

'ఏమిటదీ?' అంటూ సత్యవతమ్మ కొడుకు చేతిలోవున్న శుభలేఖ వాడిసి లాక్కుని పైనా కిందా చూసింది, తెలిసిన పేరేమన్నా కనిపిస్తుందేమోనని.

'ఈ రిటైర్డు హెడ్మాష్టరెవరండీ? పి. యల్. నరసింహంట!'

'నాకు తెలీదు. ఆయన పెళ్ళా ఏమిటి?' అన్నాడు వెం.

'చాల్లెండి. వేళాకోళమంటే యింక అదేపనా?'

'మా స్నేహితుడి తండ్రిలేమ్మా!' అంటూ వాసు తల్లిచేతి లోంచి శుభలేఖ లాక్కోబోయాడు. కాని ఆ క్షణంలోనే వెంకట నారాయణ ఆ పని చేసేశాడు. ఆయన శుభలేఖ పరిశీలించి, 'ఓరి నీ దుంప తెగా!' అన్నాడు.

'ఎవరిని దీవిస్తున్నారు? పెళ్ళికొడుకునా? తండ్రినా?' అన్నది స.

'పెళ్ళికూతురు తండ్రిని! వాడెవడో తెలుసా? నా చిన్ననాటి స్నేహితుడు. పురుషోత్తంగాడు. పట్నంలో చేరి అక్కడ చేతులుమార్చి డబ్బు లక్షలు వొడుసుకున్నాడు. వాడి చేతులకి డబ్బు బంక ఉందని ఏడిపిస్తాం! పెళ్ళి వాడింటోనె ఎగ్మూరులో ... చూశావా. దొంగ వెధవ! వాడి శుభలేఖ రానేలేదు. పెళ్ళికొడుకు తరవు శుభలేఖ వచ్చింది!'

'ఇది బాగానేవుంది. దూరం వెళ్ళినట్టుంటుంది. పెళ్ళి కలి సొస్తుంది. మనం మగపెళ్ళివారి తరఫున వెళదాం!' అన్నది స.

'నాకొచ్చింది శుభలేఖ. మిమ్మల్నందర్నీ యెవరు పిలిచారు. మీారు రావటానికి వీల్లేదు' అన్నాడు వాసు. వాడికి ఇరవైఏళ్ళు. బీయస్సీ పరీక్షకు కూచున్నాడు. అన్నిట్లోనూ 60 కి పైనవస్తే ఫస్టు క్లాసులో ప్యాసవుతాడు. 35 కు తక్కువొస్తే తప్పుతాడు అదీ పరిస్థితి.

కాని వాసు తన వయసునుబట్టి యిప్పుడిప్పుడు తన వ్యక్తిత్వాన్ని గట్టిగా నిలబెట్టుకుంటున్నాడు. ఎంతచెడ్డా - చెడటం ప్రసక్తి లేదనే అనుకోండి! — తల్లిగనక సత్యవతమ్మ తనకొడుకు వ్యక్తిత్వం ప్రదర్శించి నప్పుడల్లా 'శొరా పిడుగా!' అని లోపల అను కుని, పైకి వాణ్ణి ఉడికించే మాటలని వాడు ఉడుక్కుంటే చూచి ఆనందిస్తుంది.

'అదేమిట్రా? నీకు ఆహ్వానం వస్తే అది మాకుకాదూ? అందులో విత్ ఫామిలీ అండ్ ఫ్రండ్స్ అని లేదూ?' అని అడిగిందావిడ.

'ఇంకా నయం! విత్ మదర్, ఫాదర్, బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అని లేదాఅని అడగలేదు! చూడు కావలిస్తే. ఇది నా ఒక్కడికే!' అన్నాడు వాసు.

'ఇప్పుడు ఫామిలీ అండ్ ఫ్రండ్స్ అని రాయటం మానేశారు. అట్లా రాశారో పెళ్ళివాళ్ళు దివాలాయెత్తి ఐపీ పెట్టాల్సిందే!' అన్నాడు వెం.

'అదేమిటండీ చోద్యం! ఇన్విటేషన్ అందుకున్నవాళ్ళు మాత్రమే వెళతారూ?'

'సకుటుంబంగా మనం రావాలనుకుంటే వెంకట్నారాయణ అండ్ కో అనో, అండ్ ఫామిలీ అనో రాస్తారు. ఫ్రెండ్స్ ప్రసక్తిలేదు' అంటూ కల్పన చేశాడు వెం.

'లేకపోతే మానె. మనం వాసుతోబాటు యీ పెళ్ళికి తప్పక వెళదాం. పట్నంచూసినట్టూ అవుతుంది' అన్నది స.

'నా వెంట మీరొద్దు. కావలిస్తే మీరు వేరే రండి. అంతే చూడమ్మా. మీరంతా యిట్లా నా వెంటపడి వచ్చారంటే నన్నెవరూ పిలవరు. తరవాత మీ యిష్టం. చెబుతున్నా' అన్నాడు వా.

వెంకటనారాయణ ఆలోచించటం మాని తన సుపుత్రుడు యీ డేరే స్టయిలు గమనించసాగాడు.

'అంత పెడసరం కూడదురోయ్. ఇప్పుడు మానుంచి వేర్పడిపోతున్నావే. రేపు పెళ్ళయితే నువు మాతో మాట్లాడతావాని! అదివరకల్లా మాకు పిలుపులొచ్చిన చోటికల్లా నిన్ను తీసుకు పోలేదూ? నెల్లోజుల సెలవు యెట్లా ఖర్చు చెయ్యాలా అని మధనపడు

తుంటిమిగదా, ఒక్కసారి నీ వెంట తీసుకుపోరా అంటే సనేమిరా అంటావా ?' అంటూ సత్యవతమ్మ కొడుకుతో ఆడుకుంది.

వాసు సీరియస్‌గా మొహంపెట్టి 'నే నొకవేళ తీసుకుపోతే మాత్రం నాన్న కెంత నామర్దా! పెళ్ళికూతురు తండ్రి స్నేహితుడై వుండికూడా పిలవలేదుగామాలని అందరూ అనుకోరూ ?' అంటూ చంకలోవున్న పోస్టు తండ్రి చేతికిచ్చాడు.

వెంకటనారాయణ ఉత్తరాలన్నీ పైపైనచూస్తూ 'అఘోరించినట్టే వుంది. ఇదిగో పురుషోత్తంగాడి ఉత్తరం!' అంటూ మిగిలినవి పక్కన పెట్టి ఆ కవరు చించి ఉత్తరం తీసి పైకి చదివాడు.

'మై డియర్ వెంకట్! మా అమ్మాయి పెళ్ళి యింకా పది రోజు లుంది. ఇన్విటేషన్లు ఒక డజను పంపిస్తాను మన పాతస్నేహితుల కందరికీ యియ్యి. ఎవరెవరు ఎక్కడుంటున్నదీ బొత్తిగా తెలియటంలేదు. ఏడాదికోసారన్నా ఎవరూ ఉత్తరంముక్క రాసిన పాపాన పోరు. (ఒకవేళ వాళ్ళు రాసినా నేను జవాబు రాయను. టైములేదు.) అందుచేత నేంచేస్తావంటే, ఇది మీ యింట్లో పెళ్ళే అనుకుని సాధ్యమైనంతమంది పాత స్నేహితుల్ని మళ్ళేసుకురా. తా. కా. మన అవకాయగాడు (ఉరఫ్ ప్రకాశం) ఎక్కడున్నాడు ? ఏం చేస్తున్నాడు ? వాణ్ణీ వందిమంత్రి సామంతాది బలగాన్నీ కొట్టుకురా. ఇప్పుడు కలునుకోకపోతే పాతస్నేహితుల్ని మరి పదేళ్ళదాకా కలుసుకోవటం వడదు— ఉత్తమ పురుషః పురుషోత్తమః'

'అయిందిగద అబ్బాయిగారి పెళ్ళి! మేమూ పోతున్నాం ఇంతోటిపెళ్ళికి! మే మెక్కనరైల్లో యెక్కకు, తెలిసిందా ?' అన్నది సత్యవతమ్మ కొడుకుతో మళ్ళీ ఆట ప్రారంభిస్తూ.

'నాయిష్టం! నాయిష్టమొచ్చిన రైల్లో యెక్కుతాను. రైలు మీదా ?' అన్నాడు వాసు. అందర్నీ తన పూచీమీద తీసుకువెళ్ళే ప్రమాదం తప్పినందుకు సంతోషిస్తూ.

వెంకటనారాయణ అప్పుడే కూచుని ప్రకాశానికి ఉత్తరం రాశాడు.

తరవాత భార్యాభర్త లిద్దరూ కూచుని, పెళ్ళి దృష్ట్యా, ప్రయాణం దృష్ట్యా కొనవలసిన వస్తువుల జాబితా వేశారు. ఇద్దరూ వేశారనటం అతిశయోక్తి అవుతుంది; సత్యవతమ్మ వేసింది. అందులోంచి ఏ అయిటమన్నా తగ్గించటానికి వీలుండేమో చూడటానికి వెంకటనారాయణ వృధా శ్రమపడ్డాడు.

ఆనందమంతా ఖర్చు చెయ్యటంలోనే వుంది. డబ్బు నీళ్ళలాగా ఖర్చవుతుంది గనకనే పెళ్ళిళ్ళు సరదాగా ఉంటాయి. పెళ్ళిళ్ళు చేసే వారిమాట అటుంచి, పెళ్ళిళ్ళకు వెళ్ళేవాళ్ళుకూడా తమ తాహతును బట్టి ఒక చిన్న పెళ్ళిచేసినంత పనీ చెయ్యాలి. సత్యవతమ్మ తనకు రెండు కొత్త చీరెలన్నా లేకుండా ఈ పెళ్ళికి వెళ్ళటం అసాధ్యమని ఖచ్చితంగా చెప్పేసింది. తన మాటననిని భర్త కూడా మరో సూటూ, ఒక జత పంచెలూ, ఒకటి రెండు షర్టులూ చేర్చటం మంచిదని సలహా యిచ్చింది. తీరా చూస్తే ముగ్గురు పిల్లలకూ పెళ్ళికి పనికొచ్చే బట్టలు లేనట్టు తేలిపోయింది. పోతే, పెళ్ళికూతురికి ఘనమైన చీరె ఒకటి కొనాలిగదా! ఇతర ప్రెజెంట్లూ... లిస్టు పెరిగిపోయింది.

మూడోనాడు యిటునుంచి ఇన్విటేషన్లూ, అటునుంచి ప్రకాశం జవాబూ వచ్చాయి. పెళ్ళికి రావటమంటేనూ, మళ్ళీ పురుషోత్తాన్ని చూడటమంటేనూ తనకు ఉత్సాహంగానే ఉందిగాని చేతిలో దమ్మిడీ కూడా లేదని ప్రకాశం రాశాడు.

వెంకటనారాయణ ముందూ వెనకా ఆలోచించకుండా, "నువ్వూ, మీ వాళ్లూ యేదో తారీక్కల్లా యిక్కడికి వచ్చెయ్యండి. పదకొండుకు అందరికీ కలిసి టిక్కెట్లు బుక్ చేస్తాను. మీ టిక్కెట్లెన్నో రాయి." అని ఉత్తరం రాసి పడేశాడు.

# 3

లక్ష్మికి కొండెక్కినంత సంతోషంగా వుంది. ఆ పిల్ల దూర ప్రయాణా లెన్నడూ చెయ్యలేదు. చిన్న ప్రయాణాలైనా జన్మకు శివరాత్రి అన్నట్టుగా ఏ రెండు మూడేళ్ళకో గాని పడవు. ఇది దూర ప్రయాణం. పైగా పట్నానికి. అందులోనూ పెళ్ళికి. మామూలు పెళ్ళి కాదు, లక్షాధికారుల ఇంటుపెళ్ళి.

మధ్యలో మజిలీ లక్ష్మి ఆనందాన్ని పెంచిందేగాని తగ్గించ లేదు. ఈ పానకంలో పుడకల్లా ఏమిటంటే లక్ష్మి తరవాత వాళ్ళు నలుగురూ బయలుదేరలేదు, వాళ్ళు ఏడిచారు. లక్ష్మి వాళ్ళమీద సానుభూతితో చాలా బాధ పడింది. వాళ్ళ ఏడుపుకు లక్ష్మి కడుపు తరుక్కుపోయింది. వాళ్ళను బంధువులింట్లో ఉంచుతూ తన తల్లీ తండ్రీ ఆడిన అబద్ధాలూ అవీ యివీ తెస్తామని చేసిన తప్పుడు వాగ్దానాలూ చూసి లక్ష్మి చాలా అవమానం చెందింది. వాళ్ళను చూసి అవమానం చెందటం లక్ష్మికి కొత్తకాదు. డబ్బు లేకపోవటం మనుషులచేత అల్ప విషయాలలో కూడా అక్రమంగా ప్రవర్తింప జేస్తుందని ఆ పిల్లకు తెలీదు. డబ్బు లేకపోవటం చేత మంచి నగలూ, చీరెలూ కొనటానికుండదనీ ఆడపిల్లలకు మంచి మొగుళ్ళను తీసుకు రావటం కష్టమనీ, అంతకంటె దుస్సహమైన కష్టాలేవీ ఉండవనీ ఆమె నమ్మకం.

ఎవరెవరు బయల్దేరాలన్న విషయం ప్రకాశానికీ, నాగమ్మకూ పెద్ద యుద్ధమయింది. వెళితే అందరూ వెళ్ళాలన్నది నాగమ్మ. అందరూ బయలుదేరకన్న యెవరూ బయలుదేరకుండా ఉండటం తనకు పరువుగా ఉంటుందన్నాడు ప్రకాశం. అయితే అందరమూ

మానేద్దామని నాగమ్మ బెట్టుచేసింది. మేము రావటంలేదని ప్రకాశం ఉత్తరం రాస్తుండగా నాగమ్మ రాజీబేరానికి వచ్చి ఆ ఉత్తరం చింపే యించింది.

ఉత్తరం చించిన మరుక్షణం అసలు యుద్ధం ఆరంభమయింది.

'అసలు మీ కేమిటభ్యంతరం? డబ్బెవరో పెట్టుకున్నప్పుడు?' అని నాగమ్మ ఇరవై తొమ్మిదిసార్లడిగింది కొద్ది కొద్ది మార్పు చేర్పులతో.

'ఇతరుల డబ్బు గనుకనే కొంచెం ఒళ్ళు దగ్గిర పెట్టుకుని ఉండాలి. రేపు ఇంతకన్న పెద్ద అవసరం వస్తే ఆదుకునే వాళ్ళను పొందుగుకోసి పాలు తాగకూడదు. బంగారు గుడ్డుపెట్టే బాతు కథ వినలా?' అంటూ రకరకాలుగా ప్రకాశం మాట్లాడాడు.

ప్రకాశం రెండోసారి ఉత్తరం ప్రారంభించి తాము రావడం లేదని వెంకటు నారాయణకు రాయటం మొదలు పెట్టినాక నాగమ్మ తన భర్త చేస్తున్నది అఘాయిత్యమని ఆరోపించింది. తాను అందరూ వెళ్ళితే బాగుంటుందనే అభిప్రాయం చెప్పినట్టూ, వెళ్ళి తీరాలని శాసించినట్టూ, శాసించటానికి తానెవరన్నట్టూ చెప్పింది.

బయలుదేరి వెంకటు నారాయణగారి ఊరొచ్చారు. రైల్లో యెక్కినది మొదలు లక్ష్మి పుకకలన్నిటినీ మనసులోనుంచి ఏరి పారేసి పానకాన్ని మాత్రమే మిగుల్చుకుంది.

వెంకటునారాయణ గారింటి వాతావరణం లక్ష్మికి ఆవర్శ ప్రాయంగా ఉందనిపించింది. తన తలిదండ్రులల్లే వెంకటునారాయణా సత్యవతమ్మా కీచులాడుకోరు. సత్యవతమ్మకూడా హాస్యంగా మాట్లాడు తుంది. తనతల్లికన్న ఆవిడ నిజం నిర్భయంగా మాట్లాడే మనిషిలాగా కనపడింది. ఆవిడ బాగా చదువుకుందిట.

వాసుకూడా లక్ష్మికి కొత్తరకం అనుభవమే. తమ ఊళ్ళో వాసు ఈడువాళ్ళు తనతో మాట్లాడరు. బంధువులూ, బాగా ఎరిగిన వాళ్ళూ అయితే తప్ప ఎవరూ చూడనప్పుడు దొంగచూపులు చూస్తారు. వాసులో ఈ లక్షణాలేవీ లేవు. చాలారోజులుగా యెరిగినట్టుగా పలకరించాడు. తనదగ్గిరికి కుర్చీ ఈడ్చుకుని దానిమీద కూర్చుని, "ఏం చదువుతున్నావు? నీకేం సినిమాలిష్టం? వార పత్రికల్లో ఏది ఇష్టం?" ఇట్లా కబుర్లలో పెట్టాడు. అతనితో మాట్లాడటానికి లక్ష్మికి కొంచమైనా పట్టివ్వలేదు. అతను తన స్నేహితులను గురించీ వాళ్ళు వెళ్ళిన ఎక్స్‌కర్షన్లు గురించీ చెబుతుంటే లక్ష్మికి అంతా తెలిసినట్టే ఉంది.

"ఈ పెళ్ళికొడుకు నాక్లాస్‌మేట్ తెలుసా?" అన్నాడు వాసు గర్వంగా.

"నిజం?" అన్నది లక్ష్మి.

"మా నాన్నకు పెళ్ళికూతురువాళ్ళ శుభలేఖ రాకముందే నాకు పెళ్ళికొడుకువాళ్ళ శుభలేఖ వచ్చింది. చూపిస్తానుండు."

ఒక శుభలేఖేమిటి, వాసు లక్ష్మికి ఎన్నో ఫొటోలు, పుస్తకాలూ తాను క్యారమ్స్‌లో గెల్చుకున్న కప్పూ — ఎన్నో చూపించాడు. వాసూ, అతని తమ్ముడూ కారమ్స్ సింగిల్స్ ఆడారు. లక్ష్మి నాడమంటే తనకు చేతకాదన్నది. నేర్పుతానన్నాడు వాసు. లక్ష్మి ప్రయత్నించింది గాని అది అంత సులువుగావచ్చే ఆటగా కనిపించలేదు. వాసు తమ్ముడంత ఆట రావటానికైనా ఎన్నోఏళ్ళు పట్టేటట్టు కనిపించింది లక్ష్మికి.

నాగమ్మ వెంకటనారాయణగారింట అడుగుపెట్టిన రెండు మూడు గంటలలోపల దాదాపు అన్నిరకాల మనోవికారాలకూ గురి అయింది. రైలెక్కకముందే ఆవిడ తాము వెళ్ళబోయే చోట తమకు అవమానం తప్పక జరుగుతుందనుకున్నది. ఆవిడకు స్నేహితాలలో



నమ్మకంలేదు. ఈ వెంకటనారాయణ తన మొగుడితో చిన్నప్పుడు కలిసి చదివి ఉండవచ్చు. కాని ఇప్పుడు వాళ్ళిద్దరిమధ్యా చాలా తేడా ఉంది, ఈ తేడా తాను కళ్ళారా చూడకపోతానా అనుకుంది.

కాని తీరా చూస్తే ప్రకాశంకన్న వెంకటనారాయణే ఎక్కువ స్నేహభావం కనపరిచాడు. అదిచూసి నాగమ్మ తనభర్త అటువంటి స్నేహానికి అర్హుడుకాదనీ, వెంకటనారాయణలో, మొగుడిలోనూ, తండ్రిలోనూ ఉండదగిన మంచిలక్షణాలన్నీ ఉన్నాయనీ, తన మొగుడి వంటివాళ్ళు ఎక్కడోగాని ఉండరనీ అనుకున్నది.

సత్యవతమ్మను చూసి ఆవిడ వెకిలి మనిషని కాస్సేపూ, అతిశయంగల మనిషని కాస్సేపూ, ఆవిడ మాట్లాడేపద్ధతంతా తెచ్చి పెట్టుకున్నదని కాస్సేపూ అనుకున్నది. చివరకు ఆవిడ తనంత సంస్కారమూ, దూరదృష్టీ, విమర్శా గల మనిషికాదనీ, పైపై మెరుగులతో జీవిస్తున్నదనీ తేల్చుకున్నది.

వాసు లక్ష్మిని కూచోబెట్టి కబుర్లు చెబుతుంటే నాగమ్మ మనస్సులో మెరపులు మెరిశాయి. వాసు లక్ష్మిని చూసి సమ్మోహితుడైనాడని నాగమ్మ రూఢి చేసుకుని, వాళ్ళిద్దరికీ పెళ్ళి కావటానికి వాళ్ళ నాన్నల స్నేహం ఏమన్నా ఉపకరిస్తుందా అని ఆలోచించ సాగింది. మాట వరసగా అడిగినట్టుగా వాసును గురించి సత్యవతమ్మను అయిదారు ప్రశ్నలు వేసింది. సత్యవతమ్మ నవ్వుతూ సమాధానం చెప్పటం చూసికూడా, తన ఆలోచన ఆవిడ పసికట్టిందని నాగమ్మ గ్రహించలేదు.

వెంకటనారాయణ ఒంటరిగా తటస్థపడ్డప్పుడు సత్యవతమ్మ, "ఏమండోయ్-డేంజర్!" అన్నది.

"ఎట్నుంచీ? ఎవరికీ?" అన్నాడు వెం.

"బాబోయ్ వియ్యపరాలు! ... వాసును గురించి వాకబు చేస్తోంది!"

"ఆడపిల్ల తల్లికామాత్రం వుండదా? వాసు తన పెళ్ళాన్ని తానే చూసుకుంటాడని అర్థమయ్యేట్టు చెయ్యలేక పోయావా?

"ఇంకా ఆ స్టేషను రాలేదు... వాసు ప్రస్తుతం ఆ పనిలోనే ఉన్నాడని అనుకుంటున్నట్టున్నది." అన్నది స.

నాగమ్మ అదే సమయంలో ప్రకాశాన్ని ఒంటరిగా చిక్కించుకుని, "ఈ వాసూకి మన లక్ష్మంటే చాలా ఇష్టమల్లే ఉంది. ఈడూ జోడుగా ఉంటారు. మీ స్నేహితుణ్ణి కదిపి చూడండి. కుదిరితే మంచి సంబంధం! ఎరగనివాళ్ళయితే అనుకోవటానికి కూడా తాహతు లేదు మనకు ...... స్నేహాలు యిటువంటప్పుడే పని కొచ్చేది......" అన్నది.

"చూద్దాంలే."

"చూసేదేమిటి? మీరు చూస్తూ కూచుంటే పుణ్యకాలం కాస్తా వెళ్ళిపోతుంది. రేపు ఆ పెళ్ళిలో ఎందరో ఈ కుర్రాడిమీద కన్నేస్తారు. మనం చూస్తూనే వుంటాం. ఎవరో ఒకరు గద్ద తన్నుకుపోయినట్టు తన్నుకుపోతారు."

"మరీ బెస్తవాళ్ళభాష మాట్లాడకు. వాసు చేప అనీ, లక్ష్మి యెర అనీ, నేను గాలం వేసేవాణ్ణనీ అనుకుంటున్నావులాగుందే?" అన్నాడు ప్రకాశం చిరాగ్గా.

"అదేమో నాకు తెలీదు. ఇక్కడ లక్ష్మి ఒకర్తే గనుక వాసు కళ్ళన్నీ దానిమీదే వున్నాయి. రేపక్కడ పెళ్ళిలో ఎర్రగా బుర్రగా, నైలాన్ వోణీ వేసుకుని, పౌడరు కొట్టుకుని నలుగురాడపిల్లలు కనిపించారంటే యీ అబ్బాయి లక్ష్మికేసి చూస్తాడా?"

"అందుకని యిప్పుడే వాడిమెడకువుచ్చువేసి వెంకటనారాయణ చేత పెళ్ళి దస్తావేజు రాయించి సాక్షి సంతకాలుకూడా చేయించ

మంటూవా ఏమిటి ? నావల్లకాదు. నే నిటువంటి వెధవపను చెయ్య లేను గనక నే నా కింకా ఒకరో అరో స్నేహితులంటూ అఘోరించారు!"

నాగమ్మ నోరు నొక్కుకుని, "అరవకండీ! పిల్లకు సంబంధం చూడటం వెధవపనా ? అవ్వ! ఎవరన్నా వింటే నవ్విపోతారు. స్నేహితుణ్ణే అడగలేకపోతే ఇంకా పైవాళ్ళ నేమడుగుతారు ? మీ వల్ల ఏదీకాదని నాకు మొదణ్ణుంచీ తెలుసు." అన్నది.

"తెలిసినదానివి తెలిసినట్టుండక పనులు పురమాయిస్తా వెందుకూ ?"

మీరు మొండికేసి కూచుంటే నా యేడుపేదో నే నేడుద్దా మనీ !"

"నీ యేడుపేమిటో నాకైతే తెలీదుగాని, నీవు చాతావాతా కాకుండా ఏడ్చి అయేపని కూడా చెడగొట్టుకుంటావు. ముందే చెప్పా. తరువాత నీ యిష్టం."

వాసు పైకి కనపడినంత అమాయకుడేమీ కాడు. అతను చిన్నతనంనుంచీ ఆడపిల్లలతో తిరగ మరిగినవాడు. వాళ్ళను కంగారు పెట్టకుండా, తాను ఆత్రపడకుండా, తాపీగా వాళ్ళను ఆకర్షించు కోవటం అతనికి తెలుసు. అభ్యంతరకరమైన పనులేవీ చెయ్యకుండా, ఏదైనా చేసినా బాగుండునని ఆడపిల్లలకు అనిపించేదాకా తెచ్చే వాడు.

లక్ష్మిని చూడగానే వాసు మంచి ఆటవస్తువు - అట్టే గడుసు తనమూ, గొడ్రతనమూ లేనిది - దొరికిందని కనిపెట్టాడు. అతను లక్ష్మిని ఒంటరిగా చిక్కించుకొనటానికి ఏ ప్రయత్నమూ చెయ్య లేదు. వాళ్ళిద్దరూ ఉన్నచోటునల్లా వాసు తమ్ముడు పదమూడేళ్ళ వాడు ఉంటూనే వచ్చాడు. లక్ష్మి ఈడు ఆడపిల్లలంతా ఆ కుర్రాడికి రంభలల్లే ఉండేవాళ్ళు. వాళ్ళు పక్కగదిలో ఉన్నా కూడా వాడికి ఆ మాట తలుచుకుని ఆనంద పారవశ్యం కలుగుతూండేది.

ప్రకాశమూ, నాగమ్మా ఘర్షణ పడుతున్న సమయంలో వాళ్లు ముగ్గురూ మేడమీదికి యెక్కుతున్నారు. వాసు తమ్ముడు గబగబా పైకి వెళ్ళాడు. వాసు మధ్యలో ఆగి, "నీకూ నాకూ ఒక మెట్టెత్తు వార." అన్నాడు లక్ష్మితో. అది రుజువు చెయ్యటానికి లక్ష్మిని ఒక మెట్టుపైన నిలబెట్టి, "అంత వారలేదా" అంటూ తన నెత్తినా, లక్ష్మి నెత్తినా చెయ్యిపెట్టి చూసుకున్నాడు.

ఈ ఎత్తులు చూసుకోవటం లక్ష్మి ప్రాణానికి చాలా రొమాంటిక్‌గా ఉంది.

"నువు పూసుకున్న సెంటేమిటి?" అన్నాడు వాసు.

"నే నేమీ పూసుకోలేదే?" అన్నది లక్ష్మి ఆశ్చర్యంగా.

"అబద్ధం...ఏదో ఎరిగిన సెంటే..." అంటూ వాసుముందు గాలివాసన చూసి తరవార లక్ష్మిని భుజం దగ్గిరా, మెడ దగ్గిరా, చెంపమీదా వాసన చూశాడు. "సెంటనుకున్నాను సుమా. నీ వొళ్లే మంచివాసన!" అన్నాడు.

లక్ష్మి నరాలన్నీ జివ్వన లాగాయి.

పైనుంచి తమ్ముడిమాటలు వినిపించాయి. వాసు లక్ష్మి పిర్ర మీద తట్టి "పోదాం పద, గోపాలుగాడు అరుస్తున్నాడు" అన్నాడు.

లక్ష్మికి వాసు తమ్ముడిమీద మండిపోయింది. "వీడోడూ!" అనుకున్నది. తన శరీరభాగా లేవైతే వాసును స్పృశించాయో అవన్నీ బంగారమైపోయినట్టు లక్ష్మి భావించింది. తానుకూడా చొరవ చేసుకుని వాసును ఏదో వంకమీద తాకింది. అతన్ని తట్టి మాట్లాడింది. మేడమీద గోడలకు తగిలించిన ఫొటోలు చూసేటప్పుడు అతన్ని అనుకుని నిలబడింది. తన వెనకగా నిలబడిన లక్ష్మిని వాసు చాలాసార్లు మోచేత్తో నొక్కి మాట్లాడాడు.

నాగమ్మ తన కూతురు చాలాసేపు కనిపించక పోయేసరికి

కొంప మునిగిపోయినట్టు 'లక్ష్మి ఏదీ? ఎక్కడా కనిపించదేం?' అన్నది ఏ ఒకర్నీ వుద్దేశించకుండా.

'పిల్లలు పైన చేరినట్టున్నారు' అన్నది సత్యవతమ్మ. ఆవిడ వాసునూ, గోపాలనూ కేకలుపెడితే యిద్దరూ పలికారు.

'అమ్మ పిలుస్తున్న దెందుకురా?' అన్నాడు వాసు.

కనుక్కొస్తానంటూ వాసు తమ్ముడు శరవేగంతో కిందికి వెళ్ళాడు.

వాసు లక్ష్మికేసి తిరిగి 'మనం స్నేహితుల మౌనా కాదా?' అన్నాడు. లక్ష్మి ఔనన్నది. 'ఐతే మనమధ్య ఒక్క రహస్యం వుండాలి. చెబితే దాస్తావా?' అన్నాడు. లక్ష్మి దాస్తానన్నదిగాని ఆమె కేదో భయం పుట్టుకొచ్చింది.

'ఎవరికీ చెప్పకూడదు! చెబితే చెడ్డ ఒట్టు! సరేనా?' అన్నాడు వాసు. సరేనన్నది లక్ష్మి.

'ఇదీ రహస్యం' అంటూ వాసు లక్ష్మిని తనకేసి లాక్కుని ముద్దుపెట్టుకోబోయాడు. లక్ష్మి మూతి గట్టిగా బిగించింది. వాసు లక్ష్మి అంకిళ్ళు నొక్కి మూతితెరిచి చాలాసేపు ముద్దు పెట్టుకున్నాడు. లక్ష్మి గుండెలు పగిలినంత పని అయింది.'

## 4

పురుషోత్తంగారింటో పెళ్ళి హడావుడి చాలా జాస్తిగా ఉంది లంకంత యిల్లున్నాకూడా వచ్చిన బంధువులకే చాలలేదు. కొందరు అతిథులను దూరాన ఉన్న ఒక స్కూలు భవనంలో విడిది చేయిం

బాడు. ఇల్లుకన్న స్కూలే బాగున్నది. పెళ్ళివారింటికి రావటానికీ పోవటానికీ ఒక వాన్ ఏర్పాటు చేశారు.

పెళ్ళిళ్ళకు బయలుదేరేవాళ్ళు తాము మాత్రమే అతిధులైనట్లూ ఆతిధ్యం ఇచ్చేవాళ్ళు తమను గురించే ఆలోచించేటట్లూ ఊహించుకుంటారు. నదులు అలాగే ఎంతో కీర్తినీ,ఖ్యాతినీ మోసుకుని సముద్రం కేసి పోతాయి. సముద్రంలో చేరగానే వాటి వ్యక్తిత్వం కాస్తా రూపుమాసిపోతుంది. గొప్పవాళ్ళ ఇళ్ళలో పెళ్ళిళ్ళకు వెళ్ళినవారి సంగతీ అంతే.

పురుషోత్తం వచ్చినవాళ్ళను చూశాడు. పలకరించాడు. కాని మాట్లాడలేదు. మాట్లాడే అవకాశం లేదు. ఆయనకు ఏదో చెప్పటానికో అడగటానికో అయిదారుగురు అనుక్షణమూ ఉంటూనే ఉన్నారు. వాళ్ళు కార్యకర్తలు. వాళ్ళతో మాట్లాడ్డంమాని అతిధులతో కబుర్లు చెబుతూ కూచుంటే పనులు ఆగిపోతాయి.

'ఏమోయ్ ఉత్తమ పురుషా?' అని వెంకటనారాయణ పలకరించగానే పురుషోత్తం నవ్వి, 'ఓహో! వచ్చారా? ఇంకెవరు – ఇదుగో బాలన్, వాన్‌లో, వీళ్ళందరినీ స్కూలు బిల్డింగులో చేర్చి వాళ్ళ స్నానాలూ, ఫలహారాలూ చూడు!' అన్నాడు.

విడిదిలో ఆడవాళ్ళంతా ఒకచోటా మగవాళ్ళంతా ఒకచోటా చేరారు.

'రామ రామ! ఈ ఆడవాళ్ళ గది కేసి పోవటానికి లేకుండా ఉంది. పెట్టెలన్నీ అక్కడ పెట్టుకున్నారు. ఏ క్షణాన్నైనా వెళ్ళి తొంగి చూడు. సెన్సారువాళ్ళు కత్తిరించి పారేసిన హాలీవుడ్ ఫిల్ము దృశ్యం కనిపిస్తుంది. ఎవరో ఒకరు చీర విప్పుతూనో. చీర కట్టుతూనో ఉంటారు!' అన్నాడొక విట్.

'అసలిటువంటి పెళ్ళిళ్ళకు రానేకూడదు చూడరాదూ, మనకు హోస్టు పురుషోత్తంగారుకాదు. ఎవరో బాలన్‌ట — వాడూ! మనం

చెప్పుకునేదంతా వాడికి చెప్పుకోవాలి. వాడు కసిరినా పడాలి! ఇది పెళ్ళి విడిదైతే దీనికి ధర్మసత్రానికి తేడా ఏమిటి?" అన్నాడొక సినిక్.

"బాగా చెప్పావు. ఇంతదూరం పడిరావటం రైలుఛార్జీలు దండగ. ఆ డబ్బు మనియార్డరుచేసి వధూవరులకు కట్నంకింద పంపినా ఫలంపాటు! రైళ్ళను పోషించటమేమిటి?" అన్నాడు మరొక సినిక్.

"రావలసిందేననుకో. నలుగురూ కలుసుకునేటందుకు వస్తాం. కాని అది లేకపోయినాక రావటం అనవసరం. మన కుటుంబాలతో పడి వచ్చామా. రేపు మన ఆడవాళ్ళెవరన్నా వీధిలో కనబడితే పురుషోత్తంగారి భార్య గుర్తించలేదు. మన పిల్లలు కనిపిస్తే పురుషోత్తం గారు గుర్తించలేదు. దొడ్డి సంభావనకు వెళ్ళే వాళ్ళు చూడూ బ్రాహ్మలు, మనమూ అంతే. బసలో ఉండటం, వానలో వెళ్ళటం, మందలోపడి తినటం, పెళ్ళయాక వస్తామనికూడా చెప్పకుండా నెత్తిన గుడ్డవేసుకు పోవటమూనూ."

"అతిథులందరూ మనలాగే ఉంటారనుకునేరు. ఇందులో ఏక్లాసూ, బీ క్లాసూ, సీ క్లాసూ, డీ క్లాసూ ఉన్నాయి. ఏక్లాసూ వాళ్ళను పురుషోత్తంగారు స్వయంగా పరామర్శిస్తాడు. వాళ్ళ పిల్లా పీచూ, వీళ్ళ పిల్లా పీచుతో కలిసిపోతుంది. ఏక్లాసు అతిథులకు ఇది చిన్నతరహా పెళ్ళల్లేనే వుంటుంది. మనవంటి రిఫ్‌రాఫ్‌కి యిది పెద్దయింటి పెళ్ళి."

వీళ్ళ సంభాషణలు వింటుంటే వెంకటనారాయణకు మండిపోయింది. వాళ్ళు పురుషోత్తానికి ఎంత దగ్గిర స్నేహితులో ఎంత దూరపు బంధువులో ఆయన ఎరగడు. వాళ్ళ ధోరణి చూస్తే వాళ్ళెందుకు వచ్చినదీకూడా ఆయనకు అర్థంకాలేదు. బహుశా వీళ్ళు పురుషోత్తం గొప్పతనం చూసి, ఆ కీర్తి పంచుకుందామని వచ్చివుంటారు.

అంతేగాని పురుషోత్తంమీది అభిమానంతో కాదు. తాను అతిథిననే భావం వెంకటనారాయణకు ఏకోశానా లేదు. ఈ పెళ్ళిసమయంలో

తన స్నేహితుడి ఆనందం పంచుకోటానికి తాను వచ్చాడు గాని అతనికి అగ్నిపరీక్ష పెట్టటానికి కాదు.

ఈ మూకను వదిలి దూరంగా పోదామనే వుద్దేశంతో వెంకట నారాయణ లేచి, ప్రకాశం కేసి చూసి తల వూపాడు. ప్రకాశం కూడా లేచాడు. ఇద్దరూ స్కూలు కాంపౌండు వాకిలిదాకా పెళ్ళి నడకలు నడుస్తూ వచ్చేసరికి, పట్టాభి ఎదురయ్యాడు.

"అరె, దుష్టచతుష్టయంలో నాలుగోవాడు! నువ్వెక్కణ్ణుంచి వూడిపడ్డావురా, పట్టాభి? నీ ఎడ్రస్ తెలీక చాలా హైరాన పడతినే!" అన్నాడు వెంకటనారాయణ.

"నే నిప్పుడు యిక్కడే వుంటున్నా ... ... పెళ్ళివారింటికి పోతే మీరు వచ్చి యీ విడిదిలో వున్నట్టు తెలిసింది. చాలా రోజులైందిగదా చూద్దామని వచ్చా" అన్నాడు పట్టాభి.

"కిందటిసారి నిన్నుగురించి విన్నప్పుడు చాలా చిక్కుల్లో వున్నా వన్నారు. చిక్కులు వదిలాయా?" అని అడిగాడు వెంకట నారాయణ.

"ఆ, మీ అందరిచలవ! మా వాడు ఇంజనీరయాడు, ఉద్యోగం కూడా దొరికింది. వాణ్ణి ఇంజనీరింగు చదివించటం పెద్ద ఫీటుయిం దనుకో. వాడు కష్టపడి మంచి మార్కులు తెచ్చుకుని నేనుపడ్డ శ్రమ ఫలించేట్టు చేశాడు"

"ఇంకేం? మంచి కట్నం తీసుకుని వాడికి పెళ్ళి చేసెయ్యి - లేక ఆ పని యిదివరకే చేశావా?"

"ఒరే, నా దగ్గిర డబ్బుమాట ఎత్తకు. దానికోసం నేను పడిన అగచాట్లు తలుచుకుంటే జన్మ జన్మలకూ ఆ పాపిష్టి డబ్బు మాట తలపగూడదనిపిస్తున్నది. కుక్క జన్మో, పిల్లి జన్మో యెత్తించమని దేవుణ్ణి వేడుకుంటున్నాను. మా వాడికి పెళ్ళి యింకా కాలేదు. ఏ దిక్కులేని పిల్లనో చేసుకోరా అని సలహా యిస్తున్నాను ... చాలా

మంది అడిగారు. పురుషోత్తం నీకు చిన్ననాటి స్నేహితుట్టగదా, కూతుర్ని మీవాడి కిచ్చి చెయ్యలేకపోయాడా అని. అర్థంలేని ప్రశ్న. తెలియకనో, కొక్కరింపుగానో జనం అటువంటి ప్రశ్నలు వేస్తారు' అన్నాడు పట్టాభి.

'చాలా రోజులైంది. మన అడంగులను కూడా చూద్దువుగాని రా!' అంటూ వెంకట నారాయణ పట్టాభిని లోపలికి తీసుకొచ్చాడు.

పట్టాభి ప్రకాశం ప్రక్కకు వచ్చి, 'ఒరే ప్రకాశం, ఒక్క విషయం నీకు సంతోషంగా చెప్పనా?' అన్నాడు ఏదో తలుచుకుని నవ్వుతూ.

'ఏమిటది?' అన్నాడు ప్రకాశం.

'మా వాడు ఇంజనీరు కావటానికి నువే కారణం!' అన్నాడు పట్టాభి.

. ప్రకాశం బిత్తరపోయి, 'అదేమిట్రా?' అన్నాడు.

'వాడయిదేళ్ళవాడో ఏమో అయి ఉండగా బెజవాళ్ళో మా యింటి కొచ్చావు. జ్ఞాపక ముందీ?'

'ఆ.'

'వాడు కర్రలూ, మేకులూ తెచ్చి ఏవేవో చెయ్యటానికి ప్రయత్నించటం చూసి, 'పిడో చిన్న ఇంజనీర్లా ఉన్నాడేంరా!' అన్నావు గుర్తుందా?'

ప్రకాశం ఆలోచించి, 'నాకేమీ జ్ఞాపకం రావటంలేదే.' అన్నాడు.

'అన్నావులే! ఆ మాట వాడి మనసులో సన్నని మర్రి విత్తనం

మల్లే నాటుకుని మహా వృక్ష మయిందనుకో! ఈ సంగతైనా వాడు ఎప్పుడన్నాడో తెలుసా ? ఇంజనీరింగు సీటు వచ్చినాక అన్నాడు."

"ఆఁ. అదంతా వాడి భ్రమ!" అన్నాడు ప్రకాశం. కాని లోలోపల అతనికి పట్టాభి కొడుకు సెంటిమెంటు చూచి ఆశ్చర్యం వేసింది. ఆనందంకూడా కలిగింది.

"ఇది నా కూతురు లక్ష్మి. మిగిలిన పిల్లల్ని తీసుకురాలేదు. ఇంకా నలుగు రున్నారు—కుచేల సంతానం." అన్నాడు ప్రకాశం.

"నీ పిల్లలేర్రా ?" అన్నాడు పట్టాభి వెంకటనారాయణతో.

"అదుగో ఈ అరటిక్కెట్టు నా కూతురే. మగపిల్ల లిద్దరూ పెళ్ళివారిల్లు పట్టుకు వేళ్ళాడు తున్నారు. రాత్రి ముహూర్తమయిం దాకా రారుట."

"ఏమండీ, జ్ఞాపకం ఉన్నానా ? నమస్కారం" అన్నది సత్య వతమ్మ పట్టాభితో.

"అయ్యో, జ్ఞాపకం లేకపోవట మేమిటి ? కాపరానికొచ్చిన కొత్తలో మా ఆవిడ సగం మాటలు మీ దగ్గరేగా నేర్చుకుందీ ?" అన్నాడు పట్టాభి.

సత్యవతమ్మ ఆడంగి కబుర్లేవో కాసిని చెప్పి ఏదో వంకన జారుకుంది.

ప్రకాశం మొహంలో ఆత్మవిశ్వాసం లేకపోవటమూ, నాగమ్మ మొహం అప్పుడే ఎవరిచేతనో తిట్లు తిన్నట్టుండటమూ, ఎంతో ఉత్సా హంగా ఉండవలసిన లక్ష్మి కూడా నీరసంగా కనిపించటమూ, చిన్న పిల్లల్ని కూడా ప్రకాశం ఇంటిదగ్గిర వదిలేసి రావటమూ చూసి పట్టాభి ప్రకాశం ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. వెంకట నారా యణ అతని అంచనాను బలపరిచాడు.

"ఏడుగురు శాస్త్రీలు ఏనూటయాభయ్యో వస్తుందట. నన్నడిగితే ఒంటిపూట తినటానికి చాలదు. పై సంపాదన ఉన్నట్టు లేదు. మనిషి

చిత్తుగా ఓడిపోయినవాడల్లే కనిపిస్తాడు. అట్లాగే మాట్లాడుతాడు కూడా! నిన్ను చూస్తే నువు పోరాడి గెలిచినవాడల్లే కనిపిస్తావు. మీ ఇద్దరిలోనూ చాలా తేడా ఉంది." అన్నాడు వెంకటనారాయణ.

"నేను గెలుపులైనుకు వెంట్రుకవాసి ఇవతలపడ్డాను. వాడు అవతల పడుంటాడు. ఒరే, దారిద్ర్యంతో పోరాటం చూశావూ, మహా భయంకరమైనది నన్నడుగు చెబుతాను. వెనుక మన సైన్సు టీచరు చెప్పేవాడు జ్ఞాపకముందా - మంచు నీటిలో తేలుతుంటే నీటికి మంచుకూ యెంతో తేడా కనిపిస్తుందిగాని రెంటి టెంపరేచరూ ఇంచుమించు ఒకటేనని? అంతే నాకూ ప్రకాశానికీ తేడా అయి ఉంటుంది. చాలా విషయాల్లో ప్రకాశం నాకన్న తెలివిగలవాడు," అన్నాడు పట్టాభి.

కొంత తేడా పెళ్ళాలనుబట్టి కూడా ఉంటుందని అందామను కున్నాడు వెంకట నారాయణ - కాని మానేశాడు. నాగమ్మ అతనికి నచ్చలేదు. ఆమె కరటకదమనకుల తరగతికి చెందినదని వెంకట నారాయణ అనుమానం. కరటకదమనకులు నయం; ఒకళ్ళ కుళ్ళు ఆలోచనలు రెండోవాళ్ళకు చెప్పుకుంటారు — నాగమ్మ కుళ్ళు నాగమ్మకే తెలియాలి.

నాగమ్మ గురించి తనకు ఏర్పడ్డ యీ అభిప్రాయాన్ని సత్యవతి కూడా బలపరిచింది. వాసుకు ప్రకాశం కూతుర్ని చేసుకోవటంగురించి తనకు ఏవిధమైన అభ్యంతరమూ వుండనవసరంలేదు సరేకదా, వుత్సాహంకూడా వుండదగిన సంగతి అయినప్పటికీ నాగమ్మ తన కొడుకుపైన ఒక కన్నువేసిందనగానే వెంకటనారాయణకు ఆ ఆలోచనే అసహ్యమనిపించింది. ఆ అసహ్యాన్ని చూసుకుని అతను భార్యతో "ప్రకాశం తన పిల్ల నిస్తానని ఒకవేళ అంటే?" అన్నాడు.

సత్యవతమ్మ కాస్సేపు ఆలోచించి "కట్నాలూ-కానుకలూ రావనుకోండీ! వాటిని తగలేసిరి. పిల్ల ఖంకొంచెం అందంగావుంటే

ఒప్పుకొన్నా ఒప్పుకోవచ్చు ... ... తీరా చేసుకుంటే, ఏం చూసి చేసుకున్నారమ్మా అని ఎవరన్నా అన్నప్పుడు తలొంచుకోవాలి! అంతేగా ?' అన్నది.

ఆవిడ అట్లా అన్నమీదట ప్రకాశం యీ ప్రస్తావన తీసుకురాకుండా వుంటేనే మేలనుకున్నాడు వెంకటనారాయణ. ఏదో ఒక బొంకు బొంకలేక కాదు. 'ఏమో నాయనా! వాడిష్టం. వాడొప్పుకుంటే మా ఎవరి అభ్యంతరమూ వుండబోదు. మనతరంవాళ్ళకే పెద్దలు మన యిష్టంమీద పెళ్ళిళ్ళు చేసినప్పుడు వాసు పూర్తిగా యిష్టపడిన సంబంధమే చెయ్యటం విధాయకంగదా ?' అనవచ్చు ... ... ... కాని స్నేహితుడితో—చిన్ననాటి స్నేహితుడితో—కోపంగా మాట్లాడడమంటే వెంకటనారాయణకు కాస్త బాధ అనిపించింది.

కాకపోయినా ప్రకాశం దారిద్ర్యం వెంకటనారాయణకు అడుగడుగునా పరీక్షే అనిపించింది. 'నీవు నిజంగా స్నేహితుడివే అయితే నన్ను ద్వేషించకుండా వుండు చూస్తాం!' అని ప్రకాశం దారిద్ర్యం సవాలు చేస్తున్నది! ప్రకాశాన్ని చూసినప్పుడల్లా మంచాన పడినవాళ్ళూ, అవిటివాళ్ళూ, వ్యాజ్యాల్లో ఓడిపోయినవాళ్ళూ జ్ఞాపకం వస్తున్నారు. నూటయాభై రూపాయలమీద ఏడుగురు బతకటం—ఘోరం! ఘోరం! అంతకన్న ఎక్కువ మంది కూడా బతుకుతూ వుండి వుండవచ్చు. కాని వాళ్ళను వెంకటనారాయణ ఎరగడు! వాళ్ళు అతనితో కోతికొమ్మంచి ఆడినవాళ్ళు కారు. ప్రకాశం అటువంటివాడు కాదే... ...పోనీ, పాడుపీడ!

లక్ష్మి పరిస్థితి భయంకరంగా వుంది. ఆమెను ఎవరూ గమనించకపోవటం చాలా మేలయింది. ఆమెకు యీ విడిదీ, నలుగురూ ఆడే మాటలూ, ఈ పెళ్ళీ, హడావుడీ అంతా కలలాగా వుంది—వాసు ఒక్కడే మాయని సత్యం అనిపించాడు. కాని వాసు ఏడీ? అతను సినిమా తారల్లాంటి ఆడపిల్లలమధ్య హాయిగా కాలం గడుపుతున్నట్టు వూహించుకున్నది. ఆమెకు తనమీదా, ప్రపంచంమీదా తీవ్రమైన రోత పట్టింది. మధ్యాన్నం అన్నం సరిగా తినలేదు. సాయంకాలం

**ఆడవాళ్ళంతా** సబ్బువేసి మొహాలు రుద్దుకుని, గరగరలాడే చీరలు కట్టుకుని అద్దాలలో చూసుకుంటూ నగలూ అవీ సర్దుకుంటుంటే "వీళ్ళందరికీ ఏమిటీ తాపత్రయం" అని ఒక చెంప అనుకున్నది. ఇంకోవంక ఆమె మనసు వీళ్ళందరికన్నా మంచి బట్టలు కట్టి, మంచి నగలు పెట్టుకుని, దేవకన్యలాగా ముస్తాబు కావాలనికూడా కోరింది. ఐతే యీ కోరిక గొంతెమ్మకోరిక. అందులో నిజం ఏమీ లేదు.

'ముహూర్తానికి వేళ అవుతున్నది. బండీ వచ్చింది. ముందు ఆడవాళ్ళంతా యెక్కి వెళ్ళండి.' అని యెవరో కేక పెట్టారు.

అందరితోబాటు లక్ష్మికూడా కదిలింది. బయలుదేరుతున్న వారిలో తనకన్న దిష్టిపిడతల్లే వున్నవాళ్ళెవరన్నా వున్నారా అనిచూసి ఎవరూ లేరని నిశ్చయించుకున్నది.

# 5

పెళ్ళిముహూర్తం. ముహూర్తానికి దాదాపు నాలుగు వందల మంది వచ్చారు.

'జనం బాగా వచ్చారు.' అన్నా డొకాయన అందరినీ కలయజూసి.

'రాకేం. ఇరవైవేల రూపాయల బట్టలు వేసుకో. ఓ రెండు లక్షల రూపాయల కార్లు, ఓ వందరూపాయల సెంటూ, ఓ యాభై రూపాయల పూలూ—' అన్నాడు పక్కనున్న విట్.

'పెళ్ళికొడుకు ఘోరం! పురుషోత్తంగారు అల్లుణ్ణి ఎన్నుకుంది అందం చూసి మటుకు కాదు.'

"పెళ్ళికూతురూ అంతంత మాత్రమే."

"పెళ్ళికొడుకు పక్కన రంభల్లే ఉంది!"

"ఏమైనా సినిమా పెళ్ళిళ్ళుచూసి మామూలు పెళ్ళిళ్ళు చూస్తే రక్తిగా ఉండటంలా."

"ఆమాటన్నావు. బాగుంది. ఓపనిచేస్తే సరిపోతుంది. పెళ్ళి జరిగినప్పుడల్లా సినిమా స్టార్లను మేకప్‌చేసి తెచ్చి కూచోబెట్టటమూ, అసలు వధూవరులపేర్లు ఆకాస్సేపు వాళ్ళకి పెట్టటమూ, వాళ్ళకో కాల్ షీట్ డబ్బిచ్చి పంపించటమూనూ!"

"అప్పుడు పెళ్ళికి ఆహ్వానాలు కూడా అవసరంలేదు. టిక్కెట్లు పెట్టితే జనం యెగబడతారు. పెళ్ళిఖర్చులుపోగా ఋణమో పణమో మిగలనుకూడా మిగలవచ్చు."

పెళ్ళి పందిరి వాతావరణంలో సన్నాయి మేళాలమధ్య పెళ్ళి వాసనల ప్రభావంలో అతి తెలివి ఆకాశానికేసి పెరిగిపోయింది.

"వీడేరా మావాడు," అంటూ పట్టాభి తన కొడుకును తెచ్చి ప్రకాశం కూచున్న చోటికి వచ్చి చోటు చేసుకుని తనుకూడా కూచున్నాడు.

"భేష్! నీపేరేమిటోయ్!" అన్నాడు వెంకటనారాయణ.

"వెంకటరావండీ," అన్నాడు పట్టాభి కొడుకు.

కుర్రాడు చూడటానికే చురుగ్గావున్నాడు. చాలామంది యువకులలో చైతన్యం వున్నా చురుకుండదు. వాళ్ళ చైతన్యం చాలావరకు ఆనందాన్వేషణనుంచి కలిగేది ఏవో కొన్ని లక్ష్యాలుగల వాడిలో చైతన్యం కేంద్రీకృతమై చురుకుగా పరిణమిస్తుంది.

వెంకట్రావు అందంగా కూడా వున్నాడు.

'మా వాడికి ఎంతమందో సహాయం చేశారుగాని, పురుషోత్తం సహాయంచేసే అవకాశం కలగలేదు. దేనికన్నా ప్రాప్తం వుండాలి. కనీసం ఉద్యోగమైనా పురుషోత్తం కింద దొరికితే నాకు తృప్తిగా వుండేది. వాడి రిజల్ట్సు తెలియకముందే పురుషోత్తం యింకెవరికో వుద్యోగ మిచ్చాడు. అప్రెంటిస్‌షిప్ అవకాశంకూడా పైవాళ్ళే యిచ్చారు... ...పోన్లే—జరగనిదానికి అనుకోవడం వృథా' అన్నాడు పట్టాభి.

పెళ్ళికొడుకు పెళ్ళికూతురి మెడలో ముళ్ళు వేస్తున్నాడు. అందరి దృష్టీ వధూవరులమీదికి మళ్ళింది. బ్రాహ్మడు చేతు లూపాడు. అందరూ చేతుల్లోవున్న అక్షింతలు వధూవరులకేసి విసిరారు. అవి చాలావరకు సభికుల నెత్తినే పడ్డాయి.

ఆ తరువాత సభికులలో టెన్షన్ తగ్గింది. కొందరు లేచారు కూడా. వీధిలో కార్లరొదా, కారుతలుపులు మూసే చప్పుళ్ళూ సాగాయి. వెళ్ళిపోయేవాళ్ళు యింకా బయలుదేరనివాళ్ళతో వస్తామని చెబుతున్నారు. కొద్దిమంది బోనుల్లోంచి తప్పించుకున్న సర్కస్ జంతువులల్లే గబ గబ వెళ్ళిపోతున్నారు. ఇదంతా చూసి ఆనందించినవాడు వెంకటనారాయణ ఒకడే.

ఇంజనీరు వెంకట్రావు జేబులోంచి సిగరెట్టు తీసి అంటించాడు.

'ఒరే, నీ కొడుకు నీ ఎదటే సిగరెట్లు కాల్చేస్తున్నాడే?' అన్నాడు వెంకటనారాయణ.

'చాటుగా కాలిస్తే బాగుంటుందంటావా? నాక్కూడా ఒకటివ్వరా, వెంకటనారాయణకూడా కాలుస్తాడు' అన్నాడు పట్టాభి.

వెంకట్రావు సిగరెట్టు పెట్టెమీద నిప్పు పెట్టె పెట్టి రెంటినీ సర్క్యులేషన్‌లో పెట్టాడు.

దాదాపు వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు. పురుషోత్తం ఖాళీ

కుర్చీలమధ్య రిలాక్సయి కూచునిఉన్న చిన్ననాటి స్నేహితులకేసి వచ్చాడు.

'పెళ్ళిచేసి చూస్తున్నావు! ఎట్లా వుంది బరువు?' అన్నాడు పట్టాభి పురుషోత్తంతో.

'ఆఁ నాకేముంది? ఉన్నపని అందరికీ పంచేసి పై పెత్తనం మటుకు చేస్తున్నా...బసలో సౌకర్యంగా ఉందా? అటుకేసి రావటానికైనా పడలా.' అన్నాడు పురుషోత్తం.

'బాగానే వుంది. చిన్నచిన్న యిబ్బందులుంటే సరిపెట్టుకు పోతారు!' అన్నాడు ప్రకాశం.

'నువు స్నేహితుడివి గనక ఆ మాటన్నావు. ఎవరూ సరిపెట్టుకు పోరు. ప్రకాశం! ఇంటోకన్న పదింతలు బాగా జరక్కపోతే తిట్టేస్తారు. పెళ్ళినాడుమటుకు పెళ్ళి పెద్దకు అందరూ అల్లుళ్ళే అనుకో! మనం ఎంత జాగ్రత్తగా వున్నా ఏదోలోపం జరక్కపోదు.'

'మన దుష్ట చతుష్టయం చాలా కాలానికి కలుసుకున్నాంరా!' అన్నాడు వెంకట నారాయణ.

'నిజమే సుమా! మనం తీరిగ్గా కూచుని పాతకబుర్లు చెప్పుకోవాలి. మీా రెవరూ యీ పూట బసకు వెళ్ళకండి. ఇంకో గంటలో భోజనాలు రెడీ అవుతాయి. కలిసి భోం చేద్దాం.' అన్నాడు పురుషోత్తం.

అతను ఒక ఖాళీ కుర్చీలో కూచుని తన వియ్యాల వారిని గురించి వివరాలు చెబుతుండగా యెవరో పిలిచారు.

మిగిలిన ముగ్గురూ కబుర్లలో పడ్డారు.

'స్నేహితులను గురించి నే నెప్పుడూ తెగ ఆలోచించుకుంటా. కవిగాళ్ళు ప్రేమను గురించి కోసే కోతలకన్న స్నేహంలో ఇంకా ఎక్కువ విశేషం ఉందనిపిస్తున్నది. నీతో ఇరవై ఏళ్ళు కాపరంచేసి,

నీ కష్ట సుఖాలన్నీ పంచుకుని, పిల్లలతో నిన్ను కట్టేసుకున్న పెళ్లాం కన్నా ముప్పైఏళ్ళ క్రితం చూసిన స్నేహితు డెక్కువ అనిపిస్తాడు. ఎందుకు? ఎంత ఆలోచించినా స్నేహబంధం నా కర్థం కాలేదు?' అన్నాడు పట్టాభి.

'స్నేహంలో స్వార్థం లేకపోవటంచేతనేమో?' అన్నాడు ప్రకాశం.

'స్నేహంలో స్వార్థం లేదంటే నేను ఒప్పుకోను. నా కేదన్నా అవసరంపడితే మొట్టమొదట స్నేహితులను అడిగి వాళ్ళవల్ల కాక పోతే ఇంకొకరి దగ్గరికి పోతాను' అన్నాడు వెంకటనారాయణ.

'స్నేహితుడు సహాయ పడలేకపోతే నువ్వు అపార్థం చేసుకుంటావా?' అన్నాడు పట్టాభి.

'స్నేహితు డైనవాడు సహాయం చెయ్యగలిగుండి చెయ్య లేదన్న ఆలోచన ఎట్లా తట్టుతుంది? తట్టితే స్నేహమేకాదు.' అన్నాడు వెంకటనారాయణ.

'అందుచేత స్నేహానికి ముఖ్యం స్వార్థం లేకపోవటంకాదు— స్వార్థాల మధ్య పరస్పర ఘర్షణ లేకపోవటం అయుండొచ్చు. ఏమంటావ్?' అన్నాడు పట్టాభి ప్రకాశంతో.

'అట్లా అయితే నేను స్నేహాన్ని ఎన్నడూ వుపయోగించుకో లేదు. హామ్లెట్‌లో పొలోనియస్‌గాడు స్నేహాన్నీ డబ్బునూ గురించి చెప్పిన సలహా నా బుర్ర కెక్కిపోయింది. డబ్బు స్నేహాన్ని పాడు చేస్తుందని నమ్మి ఏనాడూ స్నేహితులను యాచించలేదు. ఆ పని చేస్తే నే నింత కష్టాలు పడకపోదునేమో!' అన్నాడు ప్రకాశం.

అతనన్నమాటలు ఆ సందర్భంలో బరువైనాయేమో మరి,

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. కాస్సేపుండి ప్రకాశమే 'నేను చేసినది తప్పుకాదేమోలే. ఈనాటి ప్రపంచంలో అన్నిటికన్నా డబ్బు శక్తిగలది. దానికీ స్నేహానికీ పోటీ పెట్టటం మంచిదికాదు' అన్నాడు.

'ఒరే, స్నేహానికి అన్యాయం చేస్తున్నావు!' అన్నాడు పట్టాభి.

'నువ్వా కష్టాలు పడ్డవాడివే! నాకు ఏ స్నేహితుడు యే ఆపత్సమయంలో ఆదుకున్నాడో చెప్పు. నేనుకూడా నీ దారికే వస్తాను' అన్నాడు ప్రకాశం.


'ఏ స్నేహితులూ సహాయం చెయ్యకుండానే నాకు జరిగిందనుకున్నావుట్రా. ప్రకాశం! చాలాసార్లు చాలామంది సహాయపడ్డారు. ఇంకా ఎక్కువగా సహాయపడలేదంటే అందుకు కారణం అశక్తతే ననుకోవాలిగాని, వెంకటనారాయణన్నట్టు, స్నేహితులు సహాయం చెయ్యగలిగివుండికూడా చెయ్యలేదనుకోరాదు. అలా అనుకోవటం స్నేహపాత్రత కాదు.

'పట్టాభీ, నే నొక్కటి అడుగుతాను చెప్పు. నువ్వు సంసారంలో స్థిరపడ్డాక మంచి స్నేహితులను ఎంతమందిని సంపాదించావు?' అని అడిగాడు ప్రకాశం.


పట్టాభి కొంచెం ఆలోచించి 'ఎక్కువ మందిలేరు. ఎందుకిలా అడిగావు?' అన్నాడు.

'కొద్దిమంది ఉన్నారనుకుందాం. నీకు స్నేహితుల ఆలోచన రాగానే వాళ్ళైనా జ్ఞాపకం వచ్చేది?'

'కాదు, చిన్నప్పటి స్నేహితులే జ్ఞాపకం వస్తారు.'



"మనం స్నేహం చేసేశక్తి చిన్నతనంలో ఉన్నట్టుగా పెద్దయితే ఉండదు. బాగా ఆలోచించి చూడు. నాకీ ఇరవైఏళ్ళలో గాఢమైన స్నేహం ఒక్కటి కూడాలేదు. ఇష్టమైనవాళ్ళు దొరికారనుకో. నిజంగా మాయకుండా ఉన్నవి చిన్నప్పటి స్నేహాలే ... పెద్దయి సంసారాలు మీద పడ్డాక మనస్సులు పెళుసెక్కుతాయి. వాటికి స్వేచ్ఛ ఉండదు. జీవితం హరించేస్తుంది. పెళ్ళాలు హరించేస్తారు. ఈ ఒత్తిడిమధ్య చిన్ననాటి స్నేహాలు ఫాసిలైజయి చెక్కు చెదరకుండా నిలిచిపోయి, ఏళ్ళు గడిచినకొద్దీ అద్భుతంగా కనిపిస్తాయి. ముసలి తనంలో పుట్టుకొచ్చే కామంలాగా స్నేహపాత్రత మనలో తగ్గిన కొద్ది చిన్ననాటి స్నేహాలను గురించి యావ—నోస్టాల్జియా—జాస్తి అవు



తుంది. అది మనలో గాఢంగా వుండబట్టే మనం నలుగురమూ ఇవాళ ఇక్కడ కలిశాం. స్నేహంమీద ఒక విధమైన కమ్యూనిజం నిర్మించ వచ్చునంటే నేను నమ్మను – కమ్యూనిజంమీద స్నేహాలు నిర్మించ వచ్చునేమోగాని!' అన్నాడు ప్రకాశం.

వెంకటనారాయణలాగా ప్రకాశానికి తేలికగ మాట్లాడే అలవాటులేదు. మాట్లాడటం అతనికి శ్రమతో కూడినపని. అతని ప్రమాణాలనుబట్టి యిది పెద్ద సంభాషణ. దీంతో తలనొచ్చినట్టయి నుదురు నొక్కుకున్నాడు.

'నువు బొత్తిగా సినిక్ వై పోయావురా. ప్రకాశం! అయినా నిన్ను తప్పుపట్టను. నా స్థితేమిటంటే – ఇవాళ నాకు స్నేహంలో నమ్మకం పోయిందో యిక నమ్మేటందుకేమీ లేదు. నేను దాన్ని జీవితానికి గీటురాయిగా పెట్టుకున్నాననుకో. నేను నా పెళ్ళాంతోనూ కొడుకుతోనూ స్నేహం చేసుకున్నాకే మామధ్య యెటువంటి రిజర్వే షన్సూ లేవు. అది అలా వుంచి, నాకుతగిలే ఏ మనిషయినా సరే, ముందు స్నేహపాత్రుడవునా కాదా అని ఆరా తీస్తా. నాకే స్నేహితుడు కానక్కర్లా, ఎవరికి స్నేహితుడైనా సరే చాలు. స్నేహపాత్రుడైనవాడి రాజకీయాలేవి, వాడి సోషల్ ఐడియాసెలాంటివి అని ఆరా తీస్తా. స్నేహితులు లేనివాళ్ళను గురించికూడా యిలాగే ఆరా తీస్తా. చాలా ఇంటరెస్టింగ్ రిజల్ట్స్ కనిపిస్తున్నాయి. ఎప్పుడో ఒయటు పెడతా, జీవితంలో డబ్బుకు శక్తి హెచ్చున్నావే. ఆ శక్తి ఆకే మంచిధోరణులు కలిగించటంలా. అంతో ఇంతో స్నేహమే మనుషుల్లో మంచితనం దక్కించి వుంచుతున్నది; డబ్బు ఖచ్చితంగా మనుషుల్ని తినేస్తున్నది.' అన్నాడు పట్టాభి.

ప్రకాశం విషాదంగా నవ్వి 'నేను జీవితంలో చెడ్డభాగమే చూస్తున్నానంటావు ? కావచ్చు. చెప్పానుగదా నేను ఓడినవాణ్ణి!' అన్నాడు...

భోజనాల దగ్గిర వెంకటనారాయణ పురుషోత్తంతో,' మనం ప్రకాశం సంగతి కాస్త విచారించాలిరా. పెద్దసంసారం. చచ్చు జీతం. పిల్ల పెళ్ళికి ఎదిగొచ్చింది. కొడుకు చేతి కంది రావటానికి కనీసం ఇంకా పది పదిహేనేళ్లు పట్టేట్టుంది.' అన్నాడు.

'బడిపంతులు కాదూ ? ఎంత జీతం ?' అన్నాడు పురుషోత్తం.

'నూటయాభై.'

'కనీసం మూడొందలన్నాలేందీ ఈ రోజుల్లో — ఎవరయ్యా వద్దనా ? స్వీట్లు మళ్ళీ తీసుకురారా ?' అన్నాడు పురుషోత్తం.

'అందరూ చందాలు వేస్తారా ఏమిటి? అలాటిపని చెయ్యకండి. ఆ దశకూడా వచ్చినప్పుడు చూద్దాం' అన్నాడు ప్రకాశం.

'ఒరే, నువ్వు మాట్లాడకు, చందాలే వేస్తామో, ఏం చేస్తామో, చేసేది మేమూ ! తెలిసిందా ?' అన్నాడు వెంకట నారాయణ.

'చందాలేమిటి కానీ... ప్రకాశం సమస్య ప్రధానంగా డబ్బు సమస్యే' అన్నాడు పురుషోత్తం.

ప్రకాశం పట్టాభి కేసి, 'స్నేహం సమస్య కాదు. చూశావా !' అన్నట్టు నవ్వాడు. కాని ఆ నవ్వు పట్టాభి కర్థంకాలేదు.

'ఈ గొడవ అయిపోనీ. ప్రకాశం సంగతి తప్పక ఆలోచిద్దాం.' అన్నాడు పురుషోత్తం ఆత్మ విశ్వాసంతో.

# 6

తమ గొడవల్లో మునిగిపోయి వుండేవాళ్ళు యితరుల రహస్యాలను సులువుగా తెలుసుకోలేరు. అది అనుమానం మనుషులకే సాధ్యం. తన కూతురు లక్ష్మి ఏదో మానసిక వ్యధ పొందుతున్నట్టు నాగమ్మ విడిదిలోనే పసికట్టింది. పసికట్టిందేగాని, విషయమేమిటని కూతుర్ని అడగలేదు. 'తండ్రి పోలిక! ఉత్త ఏడుపుగొట్టు! ఏ స్వల్ప విషయానికైనా లోలోపల కుమిలిపోతారు తండ్రి కూతుళ్ళు!' అనుకుంది.

ముహూర్తమప్పుడు కూడా నాగమ్మ లక్ష్మిని ఓ కంట కని పెడుతూనే ఉంది. లక్ష్మి మొహాన ఏ విధమైన ఆనందచ్ఛాయలూ లేవు. లక్ష్మి ఎవరికేసి చూస్తుందో దాన్ని బట్టి ఏమన్నా విషయం బయట పడుతుందేమోనని నాగమ్మ ఆలోచించింది. లక్ష్మి ఎవరికేసీ చూడలేదు—వధూవరులకేసి తప్ప. వరుడికి వీలయినంత దగ్గరలో తారట్లాడే వాసును లక్ష్మి చూస్తున్నదని నాగమ్మవంటి అనుమానం మనిషికి కూడా తట్టలేదు. ఆడంగిరేకులవాడికింద ఎప్పుడో జమ కట్టేసింది. తనకు ఎవరిని గురించిగాని ఒక దృఢమైన భావం కలిగితే లోకమంతా అదే భావంలో ఉన్నదని ఆమెకొక భ్రమ ఉన్నది; ఆ భ్రమ ఎన్నిసార్లు అనర్థాలు తెచ్చిపెట్టినా దాన్ని ఆవిడ పట్టుకు వేళ్ళాడుతూనే ఉంది.

ఆఖరు చాన్సు నాగమ్మకు రిసెప్షనులో దొరికింది. ఈసారి లక్ష్మి ఒకమూల పాతుకుపోక అటూ ఇటూ స్వేచ్ఛగా తిరిగింది. చాలాసార్లు వాసుదృష్టిని ఆకర్షించ యత్నించింది. వాసు తనను తప్పించుకు తిరుగుతున్నాడని నమ్మకంగా తెలుసుకున్నాక తల్లిపక్కన

కూచుని మరి కదల్లేదు. నాగమ్మకు కూతురి మనస్థితి అర్థంకాలేదు. రహస్యం బయటపడలేదు.

రిసెప్షన్‌లో ఒక తమిళగాయకుడు పాడాడు. దాదాపు ఎవరూ వినలేదు.

స్నేహితులైన పట్టాభి, వెంకటనారాయణ, ప్రకాశం, పట్టాభి కొడుకు వెంకట్రావు, అతని మిత్రులూ ఒకచోటే కూచున్నారు. వాళ్ళు సంగీతం విన్నారో లేదోగాని సంగీతంగురించి మాట్లాడు కున్నారు.

'తెలుగు కృతులు యీ అరవ్వాళ్ళు పాడుతుంటే వినలేం' అన్నాడు వెంకటనారాయణ.

'కృతులుమాటకేంగానీండి, కర్నాటక సంప్రదాయం అరవ్వా ళ్ళకి పట్టుబడలేదు' అన్నాడు వెంకట్రావు.

'నీకే అరవపాట నచ్చుతుందిటోయ్' అన్నాడు ప్రకాశం.

'బాగా నచ్చుతుంది. ఈపాడే ఆయన చూడండి. పెద్ద పేరున్న వాడు కాదుగాని రాగం ఎంత ముచ్చటగా అంటున్నాడో చూడండి. ఈ పాట పాడగలవాళ్ళు యీ పట్నంలో కనీసం రెండువేలమంది వుంటారని నా నమ్మకం. అందరూ పాటకచ్చేరీలు చెయ్యరు, కొందరు గుమాస్తాలుగా వున్నారు' అన్నాడు వెంకట్రావు.

'వీళ్ళకి రాగమూ, తాళమూ వున్నాయి. కాని భావం తక్కువ. ఈ కర్నాటక సంగీతాన్ని చివరకు అరవ్వాళ్ళే ఖూనీచేసేస్తారు చూస్తూండు' అన్నాడు వెంకట్రావు పక్కన కూచున్న మిత్రుడొకడు.

'భావం ఏమోగాని పాటలో సుఖంకోసం ప్రయత్నిస్తే బాగుణ్ణు. వీళ్ళకి సుఖమైన పాటలో నమ్మకంలేదు' అన్నా డింకో మిత్రుడు.

'మీ నాన్న పక్కన కూచున్న అబ్బాయెవరే?' అన్నది నాగమ్మ, లక్ష్మితో.

'ఏమో నాకు తెలీదు' అని కసిరింది లక్ష్మి. ఆ కోపం తల్లి మీద కాదు, వాసుమీద.

నాగమ్మ ఓడిపోయింది. బసకు తిరిగి వచ్చినాక ఆమె కూతుర్ని 'ఎందుకే అట్లా వున్నావూ?' అని లాలూచీగా అడిగింది.

లక్ష్మి చాలాసేపు ఏమీ లేదని దబాయించి, చివరకు 'వాసుకెందుకో నా మీద కోపం వచ్చింది......రైల్లోకూడా సరిగానే వున్నాడు. రైలు దిగినప్పణ్ణుంచీ నాకేసి చూడడు, పలకరించినా పలకడు' అన్నది ఏడవటం తరవాయిగా.

'ఇంతేకదా?' అన్నది నాగమ్మ. లక్ష్మి చెప్పనిది ఆమె కర్థమైపోయింది.

వీలు చిక్కగానే నాగమ్మ తన మొగుడితో, 'మీ కూతురికి ఉన్నట్టుండి ప్రేమ పుట్టుకొచ్చిందండోయ్ — వెంకట నారాయణగారబ్బాయి వాసుమీద!...సంబంధం దొరికిపోయింది. తాంబూలాలు పుచ్చుకోవటమే తరవాయి' అన్నది. ఆవిడ వాసును చూసినప్పుడు ఒక చిన్న 'టిక్' పెట్టి ఉంచింది. లక్ష్మితో అతను స్నేహంగా ఉండటం చూసి ఇంకో 'టిక్' కలిపింది. కాని తరవాత వాసు లక్ష్మి విషయం ఏమీ పట్టించుకోకపోవటం చూసి, 'అడారి వెధవ!' అనుకుని టిక్కులు తుడిపేసుకుంది. వాళ్ళిద్దరి మధ్యా చిన్న ప్రణయ కలహం ఏదో వచ్చింది ఎండుగడ్డి మంట. క్షణంలో అదే చల్లారుతుంది. వెంకట నారాయణ చూస్తూ చూస్తూ తమను కట్నం అడుగుతాడా? ఇద్దరికీ ముడిపెట్టేస్తే ఒక పెద్ద బెడద తీరిపోతుంది. ఈ పెళ్ళి వేడిలోనే ఆ పెళ్ళి కూడా ఖరారు కావడం మంచిది.

ప్రకాశం నాగమ్మ చెప్పినమాట విని కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు. తన స్నేహితుల కొడుకులలో వాసుకన్న వెంకట్రావు ఎన్నో రెట్లు యోగ్యుడుగా కనిపించా డాయనకు. వాసు గురించి ఆయనకు ఏ అభిప్రాయమూ కలగలేదు. అటువంటి నిరాకారులైన యువకులు ప్రపంచంలో కొల్లలు. అయినా లక్ష్మి వాణ్ణే చేసుకుంటానంటే చేసుకోనీ.

ప్రకాశం లక్ష్మిని ఇవతలికి పిలిచి, "వాసును చేసుకోవాలని ఉందిటే ?... ఉంటే చెప్పు. వెంకట నారాయణ నడిగి ఔననో, కాదనో అనిపిస్తా. ఏదో ఒకటి తేలిపోతే మంచిది ... మాట్లాడవేం ? అక్కర్లేకపోతే చెప్పెయ్యి." అన్నాడు.

లక్ష్మి తల వంచుకుని బలవంతాన, "అడుగు." అన్నది.

ప్రకాశం కొంచెం సంకోచించి "పట్టాభి కొడుకును వెంట్రావును చూశావా ?" అన్నాడు.

చూశానన్నట్టు లక్ష్మి తల ఆడించింది.

"వాడు నీకు నచ్చలా ? వాసుగాడికన్న వెంకట్రావు అన్ని విధాలా మెరుగేమో ? పట్టాభి నిన్ను వాడికి చేసుకుంటాడని నమ్మకం లేదనుకో. వెంట్రావుకు పదివేల కట్నంతో పిల్లనిస్తారు. అయినా అడగటానికేం ? వాణ్ణికూడా అడగమన్నావా ?"

వద్దని లక్ష్మి తల తిప్పింది.

ప్రకాశం ఆశ్చర్యపోయాడు. ఆడవాళ్ళ బుద్ధి తలకిందులుగా నడుస్తుందని ఆయనకు ఏనాడో తెలుసు. లక్ష్మికి వాసుతో వున్న స్నేహం వెంకట్రావుతో లేదన్న సంగతి తెలీదు. మనుషులు అర్థంకాకపోవటానికి కారణాలుంటాయి మరి.

'ఏంరా, వెంకటనారాయణా? మా లక్ష్మి మీ వాసును స్వయంవరం చేసుకున్నట్టుం దేమిటి? వాడి పెళ్ళి విషయం ఏమిటను కుంటున్నారు?' అని ప్రకాశం అడిగాడు.

'వాడప్పుడే పెళ్ళి చేసుకోనంటున్నాడే? నా సంగతి తెలుసుగా నీకూ! వాడి యిష్టం, నేను వాడి పెళ్ళివిషయంలో ఏమీ జోక్యం కలిగించుకోను. సలహా అడిగితే మాత్రం చెబుతాను. వాడిపెళ్ళి అను కొని నానా దేశపు రాజకుమార్తెల పటాలు తెప్పించేటప్పుడు మీ అమ్మాయి పటంకూడా పంపుదువుగాని' అంటూ వెంకటనారాయణ వేళాకోళం కిందికి దింపాడు.

'పెళ్ళిమాట దేవుడెరుగు. లక్ష్మిని చేసుకోవాలన్న ఉద్దేశం మీవాడికి అసలున్నదీ లేనిదీ కనుక్కో. మా అమ్మాయికి ప్రపంచ జ్ఞానంలేదు. అది కలలుకంటూన్న పక్షంలో ఆ కలలు పోగొట్టేభారం నామీదా, మా ఆవిడమీదా ఉంటుంది గదా.' అన్నాడు ప్రకాశం.

'దానికేం భాగ్యం? కనుక్కుందాంలే!' అన్నాడు వెంకట నారాయణ.

ఆయన ప్రకాశం మనోనైర్మల్యాన్ని శంకించలేదుగాని, వాసును చూడగానే లక్ష్మికే దురాశ కలిగిందో, లేక వాళ్ళమ్మే ఆ పిల్లకు దురాశ కలిగించిందో అనుకున్నాడు. వాసు లక్ష్మివంటి పిల్లను చేసు కోడని ఆయనకు దాదాపు రూఢిగానే తెలుసు. వాడికి బాగా చదువు కున్నవాళ్ళూ, ఫాషన్లు తెలిసినవాళ్ళూ, కాస్త మాటకారితనం గల వాళ్ళూ యిష్టం. లక్ష్మి పాతకాలపుది.

'ప్రకాశం కూతురు లక్ష్మి అంటే నీ కిష్టమేనుట్రా? నిన్ను చేసుకోవాలని ఆ పిల్ల కున్నట్టు ప్రకాశం చెబుతాడేమిటి? ఇష్టమైతే చెప్పు పెళ్ళిచేసేస్తాం' అన్నాడు వెంకటనారాయణ వాసుతో.

వాసు ఆముదం తాగిన మొహం పెట్టి "దాని మొహం! నేను లక్ష్మిని చేసుకుంటానని నువ్వెట్లా అనుకున్నావు నాన్నా, కాస్త ఎంటర్‌టెయిన్ చేసేసరికి ఆ పిచ్చిది లవ్‌లో పడ్డట్టుంది" అన్నాడు.

ఈ శుభవార్త అంచెలమీద తనకు అందగానే లక్ష్మి కుళ్ళి కుళ్ళి ఏడిచింది.

"ఇంటి కెళ్ళిందాకా కాస్త ఊరుకోవే!" అని తల్లి చివాట్లు పెట్టింది...

పెళ్ళి హడావిడి తగ్గగానే విడిది ఖాళీ అయింది.

మీరు నాలుగురోజులుండి మరీ వెళ్ళండి. ఇప్పుడు మా ఇల్లు ఖాళీయేగదా. హాయిగా ఉండవచ్చు," అని పురుషోత్తం తన చిన్న నాటి స్నేహితులనూ, వాళ్ళ కుటుంబాలనూ ఆహ్వానించాడు.

"దుష్ట చతుష్టయం" భార్యలు ఒకరి నొకరు తెలుసుకోవటానికి మంచి అవకాశం దొరికింది. వాళ్ళు ఒకరి కొకరు కొంచెంకూడా నచ్చ లేదు. ఈ సంగతి తమ భర్తలకు విడి విడిగా తామే చెప్పుకున్నారు. మగవాళ్ళు తమ పెళ్ళాలు రహస్యంగా చెప్పిన మాటలు కలబోసు కున్నారు.

"ఆడవాళ్ళ మధ్య సహజ శత్రుత్వం ఏదో ఉందర్రా! అందరూ కలసి మందల్లో ఉంటున్న కాలంలో కుటుంబాలను విభజించి రెచ్చ గొట్టినది ఆడవాళ్ళే అయిఉంటారు. పెళ్ళిళ్ళూ, కుటుంబాలూ, అవిభక్త కుటుంబాలనుంచి విభక్త కుటుంబాలూ—ఇటువంటి ఏర్పాట్లన్నిటికీ ఆడవాళ్ళే మూలకారణంకావచ్చు" అన్నాడు వెంకటనారాయణ.

"పూర్వకాలపు సమాజాలు చీలిపోయినప్పుడు ఒక్కొక్క జట్టుకు ఆడది నాయకురాలుట. ఆవిడ పేరే ఆ జట్టంతా పెట్టుకునేదిట. అందు చేత నువ్వన్నది నిజమే కావచ్చు" అన్నాడు పట్టాభి.

'ఎప్పుడో జరిగిన దానిమాట చెబుతారేమిటి? ఈ నాడు చూడరాదూ? మొగుళ్ళనుబట్టి మారుతున్న ఆడవాళ్ళు చాలా తక్కువ. మనమంతా పెళ్ళాలనుబట్టి మారినవాళ్ళమే' అన్నాడు పురుషోత్తం.

ఆయన తన భార్యతో మాటవరసగా 'పాపం ప్రకాశం నూట యాభై రూపాయలమీద అయిదుగురు పిల్లలతో యీదుకొస్తున్నాట్ట' అన్నాడు.

'నూటయాభైరూపాయ లొస్తుంటే తీపురమా? ఆయన పెళ్ళాం గవర్నరు చెల్లెలుచేసే ఆలోచనకి తక్కువ చెయ్యదే!' అన్నది పురుషోత్తం భార్య.

వధూవరులనిమిత్తం ఒక ఎక్స్‌కర్షన్ ఏర్పాటుచేశారు. వాళ్ళు చిన్నకారులో మహాబలిపురానికీ, తరవాత కంచికి వెళ్ళి యింటికి తిరిగి వచ్చేటట్టు ఏర్పాటయింది. వాళ్ళ వెనగ్గా మూడుకార్లలో పురుషోత్తం కుటుంబమూ, అతని స్నేహితుల కుటుంబాలూ బయలుదేరాయి. వాన్‌లో సామాన్లూ, వంటపాత్రలూ వచ్చాయి.

పక్షితీర్థంనుంచి దిగి వచ్చేటప్పుడు 'అసలు పెళ్ళికన్న యీ ప్రోగ్రాం బాగున్నట్టుందేమిట్రా?' అన్నాడు వెంకటనారాయణ, ప్రకాశంతో.

'నేనన్నమాట ఏమైంది?' అన్నాడు ప్రకాశం.

వెంకటనారాయణకు ప్రకాశం ప్రశ్న చప్పున అర్థంకాలేదు.

'ఓ అదా? వాసును కదిలించా. నేను నీతో ముందే అన్నానే. వాడికి పెళ్ళి ఆలోచన ఏకోశానా లేదు. మీ అమ్మాయిని అంత సెంటిమెంటల్‌గా వుండొద్దని చెప్పు' అన్నాడాయన.

'చెబుతాలే!' అన్నాడు ప్రకాశం.

# 7

"ఇంక వేం పోతామ్రా! రెండురోజుల్లో తిరిగొస్తామని చెప్పాం నాలుగురోజులకన్నా పోకపోతే ఎట్లా? పిల్లల్ని ఎవరిమీదో వదిలొచ్చాం" అన్నాడు ప్రకాశం.

'నీ కూతురి పెళ్ళిభోజన మెప్పుడోయ్ మామా' అని పట్టాభి అడిగాడు.

అవకాశం చూసుకుని ప్రకాశం పట్టాభితో తన కూతురు వాసును చేసుకుంటానన్న అభిప్రాయం ప్రకటించటమూ, వాసుకు అటువంటి అభిప్రాయం లేకపోవటము చెప్పాడు.

'అది వాసును చాలా ఏళ్ళుగా ఎరుగునా ఏం?' అన్నాడు పట్టాభి.

'లేదురా, ఒక్కరోజు వాళ్ళింటో వున్నాం. వాసు దాన్ని కబుర్లుచెప్పి ఎంటర్టెయిన్ చేసినట్టుంది.'

'దాని మొహం లే. నీకు దగ్గరలో అయిన సంబంధం లేకపోతే మా వాడికి చెనుకుంటాను. పెళ్ళి తేలికలో చేసేస్తాం. నువ్వూ లక్షాధికారివి కావు. నేనూ కాను' అన్నాడు పట్టాభి

'మీవాణ్ణి అడగొద్దూ?' అన్నాడు ప్రకాశం.

'మావాడి సంగతి నాకు తెలీదుట్రా? వాడు ఒప్పుకుంటాడు

మాటవరసగా అడుగుతాననుకో. వాడొప్పుకుంటాడు. నీకు సందేహం అక్కర్లేదు."

"సరే. నేను వెళ్ళి ఉత్తరం రాస్తాలే," అన్నాడు ప్రకాశం.

ఇంటికి చేరుకున్నాక ప్రకాశం లక్ష్మితో వెంకట్రావు విషయం చెప్పాడు.

"వాసు లోఫరు. వెంకట్రావు ప్రయోజకుడు. ఏ ఒక్క విషయం లోనూ వాళ్ళని పోల్చటానికి లేదు. పట్టాభి చిన్ననాటి అభిమానం కొద్దీ ఈ పెళ్ళికి ఒప్పుకున్నాడుగాని మరెవ్వడూ ఒప్పుకోడు. ఈ ఇరవై ఏళ్ళలో నాకు అదృష్టమంటూ ఎదురయింది యిప్పుడే!" అని కూతురికి చెప్పాడు.

"నీకూ అమ్మకూ ఇష్టమైతే చెయ్యండి." అన్నది లక్ష్మి. తన కిష్టమేనని ఆపిల్ల తన నోటిమీదుగా అననేలేదు.

లక్ష్మికి వెంకట్రావుకూ పెళ్ళి జరిగింది. లక్ష్మి మనసులో ఆనందం ఏమీ లేదు. ఏదో దూరపుగొంతు "ఈ రహస్యం ఎవరితోనూ చెప్పవుగదూ ?" అని తలలో మెదులుతూనే ఉంది.

వెంకట్రావు యోగ్యుడూ, ప్రయోజకుడూ, అందగాడూకావచ్చు. కాని అతనిలో లక్ష్మికి రొమాన్స్ ఏమీ లేదు. అతను లక్ష్మికి కోరి తెచ్చుకున్న మొగుడు కాడు. సులువుగా దొరికినవాడు. అతనెంతో వీధుల్లో వెళ్ళే వందలాది యువకులూ అంతే ఆమె ప్రాణానికి. వాళ్ళలో వెంకట్రావుకన్న అందమైన వాళ్ళూ ఇంకా పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వారూ ఉండరా ? వాళ్ళకు ఇతను తీసికట్టే!

వెంకట్రావుతో సంసారం చెయ్యటం ఆరంభించిన తరవాత అత నికి ఆమె జీవితంలో ఒక ప్రత్యేకస్థానం లభిస్తుంది. పరిస్థితుల ప్రోద్బలంచేత ఆమె అతని కష్ట-సుఖాలు పంచుకోవటం జరుగుతుంది.

రైల్లో కొద్ది గంటలసేపు కలిసిన వాళ్ళమధ్యకూడా ఏదో అనుబంధం ఏర్పడుతుంది. అందులో ఏమీలేదు. బతికున్నన్నాళ్ళూ లక్ష్మి వెంకట్రావును యితరులతో పోల్చి అతనిలో లేని సుగుణాలను యితరులలో చూస్తూనే వుంటుంది.

లక్ష్మి అంతగా మంచి సాహిత్యం చదివినది కాకపోవటం వల్లా, తల్లిప్రభావానికిమాత్రమే గురికావడంవల్లా, ప్రణయమూ-ప్రేమా అనేవి పునాదిగా లేని పెళ్ళి చేసుకోవటంవల్లా తన తల్లి రెండు దశాబ్దాలక్రితం తొక్కిన మార్గాన్నే తానూ అడుగుపెట్టింది. దేశంలో లక్షోపలక్షలుగా ఆడపిల్లలు యిదే పద్ధతిలో సంసారంలో అడుగుపెడుతున్నారు గనుక లక్ష్మిలో ప్రత్యేకత ఏమీలేదు.